విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

ఆదివారం 01 సెప్టెంబరు 2024 8 పేజీలు

విజయవాడలో... జలవిలయం

- 24 గంటలు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం
- రికార్డు స్థాయిలో 13.5 సెంటీ మీటర్ల వర్షపాతం
- చెరువులుగా మారిన రోడ్లు, వీధులు...
- నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు
- స్తంభించిన జనజీవనం
- విరిగిపడి కొండల్లు.. ఐదుగురి మృతి
- మరో రెండు రోజులు భారీ వర్షాలు!

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా విజయవాడ నగరంలో కురిసిన భారీ వర్షం జలవిలయం సృష్టించింది. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం రాత్రి వరకు సుమారు 24 గంటలు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. నగరంలో రికార్డు స్థాయిలో 13.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో విజయవాడలోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. రోడ్లు, వీధుల్లో భారీగా నీరు నిలిచిపోయి అన్ని చెరువులను తలపిస్తున్నాయి. ప్రధానంగా పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని రహదారులు జలమయమయ్యాయి. లో బ్రిడ్జి, బస్టాండ్ వెనుక వైపున రైల్వే వంతెన దిగు రహదారి, గణపతిరావు రోడ్డు, కేటీ రోడ్డు, -మిగతా 2 లో ...

భారీ వర్షాలపై మంత్రి లోకేష్ సమీక్ష

విశాలాంధ్ర-మంగళగిరి: నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఎప్పటికపుడు అధికారులతో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. టీడిపి కార్యాలయ కంట్రోల్ రూమ్ ద్వారా గంటగంటకు పరిస్థితులను వాకబు చేస్తూ సహాయ చర్యలపై అధికారులకు సూచనలు ఇస్తున్నారు. వరద ముంపునకు గురైన రత్నాల చెరువు ప్రాంత వాసులకు తక్షణమే సహాయం అందించాలని ఆదేశించారు. భారీవర్షం కారణంగా బ్లాక్ అయిన రోడ్లను వెంటనే క్లియర్ చేసి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిందిగా సూచించారు. అదేవిధంగా నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రిసిటీ అధికారులను ఆదేశించారు. వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఆహారం, తాగునీరు అందిస్తూ సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా పార్టీ శ్రేణులను కోరారు. తుపాను తీవ్రరూపం దాల్చుతున్నందున అధికారులంతా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, అవసరాన్ని బట్టి పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

గంజాయి, రేషన్ మాఫియాపై ఉక్కుపాదం

పోలీసు ఉన్నతాధికారులతో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: 'గంజాయి విక్రయాలు, వినియోగంపై ఉక్కుపాదం మోపండి. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోండి.' అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని ఎంపీ కార్యాలయంలో ఐ.జీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ లు పెమ్మసానితో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ ఈవ్ టీజింగ్ మాట వినపడితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈవ్ టీజింగ్ నియంత్రణ కోసం కాలేజీలు, యూనివర్సిటీల్లో విద్యార్థు లకు అవగాహన కార్యక్రమాలు -మిగతా 2 లో ...

లోతట్టు ప్రాంతాలలో మంత్రి రవీంద్ర పర్యటన

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : మచిలీపట్నంలో భారీ వర్షాలతో ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాల్లో స్థానిక మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించారు. వర్షాన్ని లెక్కచేయకుండా మచిలీపట్నం 20వ వార్డు గిలకలదిండిలో శనివారం ఉదయం మంత్రి కొల్లు రవీంద్ర ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గిలకలదిండిలో మంచానికే పరిమితమై పక్షవాతంతో బాధపడుతున్న లంకె పోతురాజు ఇంటికి వెళ్లి అతనిని భార్య లక్ష్మీ దేవమ్మను ఆప్యాయంగా పలుకరించి, బాగోగులు అడిగి పెన్షన్ రూ.15 వేలు అందించారు. గిలకలదిండి తుఫాన్ షెల్టర్‌లో ఉన్న పింఛను లబ్ధిదారులు యోగక్షేమాలను స్థితిగతులను -మిగతా 2 లో ...

గందరగోళంగా గుడ్లవల్లేరు

కళాశాలకు సెలవులు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: గత రెండు రోజుల నుండి గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్ లోని సీక్రెట్ కెమెరాల వ్యవహారంలో అలజడి జరుగుతుండగా కళాశాలకు సెలవులు ప్రకటించి కళాశాల బయట భారీ పోలీస్ భద్రతను ఏర్పాటు చేసారు. ఒక ప్రక్క హాస్టల్ లోని బీటెక్ విద్యార్థులు ఈ వ్యవహారంలో విచారణ వేగవంతం చేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్న తరుణంలో కళాశాలకు సెలవులు ప్రకటించి తమను తమ స్వగృహాలకు వెళ్ళమని చెప్పడం వెనుక వారు పలు -మిగతా 2 లో ...

యంత్రాంగం అప్రమత్తం

కలెక్టర్ డీకె. బాలాజీ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : జిల్లాలో శుక్రవారం రాత్రి నుండి ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరుగుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ ఆదేశించారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

గంజాయి, రేషన్ మాఫియాపై ఉక్కుపాదం

నిర్వహించాలన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని, రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువుల బెడద ఎక్కువగా ఉంటుందని చెప్పారు. అధికారులు అప్రమత్తమై నకిలీ విత్తనాలు, ఎరువుల అమ్మకాలపై మరింత కఠినంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నిత్యావసర సరుకులు అందించే విషయంలో ఎంతో నిబద్ధతగా వ్యవహరిస్తోందని తెలిపారు. ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం బ్లాక్ మార్కెటుకు తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గుంటూరు జిల్లాలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పక్కా ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

లోతట్టు ప్రాంతాలలో మంత్రి రవీంద్ర పర్యటన

అడిగి తెలుసుకొని పెంచిన పింఛన్‌తో చాలా సంతోషంగా ఉన్నామని, ప్రజల సమస్యలు దృష్టిలో ఉంచుకుని పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి కొల్లు రవీంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు, సచివాలయ కార్యదర్శులు అలియా బాష, నాగకిరణ్, మిర్యాల సురేష్, చందన వెంకట సాంబశివరావు, హరీష్ కుమార్, సాంబశివరావు, పూర్ణచంద్రరావు, యోగానంద్, స్థానిక నాయకులు వైవిఆర్ పాండురంగారావు, బచ్చుల అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

గందరగోళంగా గుడ్లవల్లేరు

అనుమానాలకు గురవుతున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు మద్దతు తెలుపుతూ వారిని స్వగృహలకు తరలిస్తున్న కళాశాల వాహనాలను అడ్డుకున్న ఎఐఎస్ఎఫ్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇదిలా ఉండగా కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధరరావు గుడ్లవల్లేరు లో విచారణను స్వయంగా పర్యవేక్షిస్తూ విచారణ వేగవంతం చేశారు. ఈ కేసు విషయమై ఎస్పీ మాట్లాడుతూ విచారణ చాలా పారదర్శకంగా సాగుతుందని త్వరలోనే కేసు పురోగతిని తెలియజేస్తామని తెలిపారు.

యంత్రాంగం అప్రమత్తం

కురుస్తున్న వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి నుండి పై స్థాయి వరకు అధికారులు అందరూ వారి కార్యాలయాల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసే విధంగా 08672 252572 ఫోన్ నెంబర్‌తో ఒక కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా వర్షాలకు గ్రామాలకు రాకపోకలు ఆగిపోయి ఉంటే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ గీతాంజలీ శర్మ, ఇన్చార్జ్ డీఆర్ఓ శ్రీదేవి, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు పలు పాసింజర్ రైళ్ళు రద్దు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : అల్పపీడనం ప్రభావంతో నిన్న సాయంత్రం నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు విజయవాడ, గుంటూరు నగరాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఎడతెరిపిలేని వర్షంతో పలు చోట్ల రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విజయవాడ డివిజన్ పరిధిలో పలు పాసింజర్ రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. భద్రతా కారణాల రీత్యా వీటిని రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. శని, ఆది, సోమవారాల్లో 20 వరకు రైళ్లు రద్దయ్యాయి. విజయవాడ- తెనాలి, విజయవాడ- గూడురు, తెనాలి- రేపల్లె, గుడివాడ- మచిలీపట్నం, భీమవరం- నిడదవోలు, గుంటూరు- రేపల్లె, విజయవాడ- మచిలీపట్నం, విజయవాడ- ఒంగోలు తదితర టౌన్ల మధ్య రాకపోకలు సాగించే రైళ్లు ఉన్నాయి.

లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రదేశాలకు

నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్గాలకు లోతట్టు ప్రాంతాల్లో, ప్రమాదం పొంచి ఉన్న ప్రదేశాల్లో నివసిస్తున్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రదేశాలకు తరలించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర తెలిపారు. నగరపాలక సంస్థ అధికారులు. 15, 16, 17, 18, డివిజన్లు, కొండ ప్రాంత ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా వారిని శనివారం పునరావస కేంద్రాలకు తరలించి వారికి అవసరమైన త్రాగునీరు, భోజన సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. వర్షం నీటిలో చిక్కుకుపోయిన ప్రజలందరూ పునరావస కేంద్రాలకు తరలిరావాలని, ప్రాణహాని లేని ప్రదేశాల్లో నివసిస్తున్న వారు బయటకు రాలేని పరిస్థితిలో ఉన్న వారికి వీఎంసీ అధికారులు ఇంటి వద్దనే త్రాగునీటి, భోజన సదుపాయం కల్పిస్తారని తెలిపారు. నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది 24 గంటలు పని చేస్తారని, నగర పౌరులకు ఎలాంటి సమస్య వచ్చినా 0866-2424172, 0866-2427485 ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి తెలుపవచ్చని, 8181960909 వాట్సాప్ ఈ నెంబర్ ద్వారా కూడా సమస్యను తెలుపవచ్చని తెలిపారు.

విజయవాడలో జలవిలయం

వించిపేటలోని అన్ని రహదారులు, భవానీపురం ప్రాంతంలోని రోడ్లు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వించిపేటలోని ఇళ్లు, మసీదులు, కేటీ రోడ్డులోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లోకి భారీగా నీరు చేరింది. అదేవిధంగా టూ టౌన్‌లోని ఏలూరు రోడ్డులో విజయ టాకీస్ సెంటర్, చుట్టుగుంట, మొగల్రాజపురం జమ్మిచెట్టు సెంటర్, మదర్ థెరిస్సా విగ్రహం ఏరియా, సిద్ధార్థ సర్కిల్, రామవరప్పాడు రింగ్ ప్రాంతాల్లో రహదారులపై భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జనజీవనం పూర్తిగా స్తంభించింది. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సర్వీసులు కూడా నిలిచిపోయాయి. భారీ వర్షాల కారణంగా ముందుజాగ్రత్త చర్యగా ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని పాఠశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు.

విరిగిపడిన కొండ చరియలు.. ఐదుగురు మృతి

భారీ వర్షాల కారణంగా మొగల్రాజపురంలోని సున్నపుబట్టీల ప్రాంతంలో కొండచరియలు విరిగి ఒక డాబా ఇల్లు, మరో రెండు పోర్షన్ల రేకుల షెడ్డుపై పడటంతో ధ్వంసమయ్యాయి. ఆ ఇళ్లలో నివాసం ఉంటున్న లక్ష్మి(49), నవుడు మేఘన(24), జంపన అన్నపూర్ణ అనే మహిళలతోపాటు కలకత్తాకు చెందిన లల్లు, సంతోష్ (30) మృతిచెందారు. అదేవిధంగా మరో ఇద్దరు శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు భావిస్తున్నారు. వారి కోసం శిథిలాలను తొలగిస్తున్నారు. ఈ ఘటనలోనే మరో నలుగురికి గాయాలయ్యాయి.

దుర్గగుడిపై తప్పిన ముప్పు.. ఘాట్ రోడ్డు మూసివేత

ఇంద్రకీలాద్రిపై నుంచి కొండచరియలు, మట్టి గెడ్డలు విరిగిపడ్డాయి. దుర్గగుడి ప్రొటోకాల్ ఆఫీసు, డోనర్స్ లాంజ్‌లు ధ్వంసమయ్యాయి. కొండ చరియలు కూలిన సమయంలో ఆయా ప్రాంతాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొండ చరియలు విరిగిపడుతుండటంతో ముందుజాగ్రత్తగా దుర్గగుడి ఘాట్ రోడ్డును అధికారులు మూసివేశారు. మరోవైపు కొత్తపేటలోని పితాని అప్పలస్వామి వీధిలో కొండచరియలు విరిగిపడి మూడు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఈ ప్రాంతాన్ని పశ్చిమ తహశీల్దార్ పరిశీలించారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామని, సహాయక చర్యల కోసం అవసరమైనవారు సంప్రదించాలని సూచించారు.

మరో రెండు రోజులు భారీ వర్షాలు

తుఫాను శనివారం అర్ధరాత్రి సమయంలో శ్రీకాకుళం జిల్లాలో తీరం దాటే అవకాశం ఉందని, అందువల్ల ఆదివారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సోమవారం సైతం ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవొచ్చని వెల్లడించారు. రానున్న రెండు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు, కొండ ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని నగరపాలక సంస్థ అధికారులు సూచించారు.

పేరిశెట్టి కుటుంబానికి సీపీఐ శ్రేణుల పరామర్శ

విశాలాంధ్ర-పెడన: గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలో ఇటీవల మరణించిన పేరిశెట్టి కోట నాగమల్లయ్య కుటుంబ సభ్యులను సీపీఐ నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు మాట్లాడుతూ కోట నాగమల్లయ్య కప్పలదొడ్డి గ్రామంలో యువజన సమాఖ్య సభ్యుడుగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి కప్పలదొడ్డి గ్రామ సీపీఐ కార్యదర్శిగా నియోజకవర్గ కార్యదర్శిగా సుదీర్ఘకాలం పని చేశారని, అంతేకాకుండా బాల భాస్కర వివర్స్ కోఆపరేటివ్ సొసైటీ మరియు అరుణశ్రీ చేనేత సహకార సొసైటీల అభివృద్ధికి అవిశ్రాంత కృషి చేశారని కొనియాడారు. కోట నాగమల్లయ్య మృతి పార్టీకి ప్రజాసంఘాలకు తీవ్ర నష్టమని రామారావు అన్నారు. పరామర్శించిన వారిలో సీపీఐ పెడన నియోజకవర్గ కార్యదర్శి పేరిశెట్టి ఉమాకాంతరావు, సీపీఐ పెడన కార్యదర్శి తుమ్మ చినకొండయ్య, మహిళ సమాఖ్య నాయకురాలు మోదుమూడి అరుణకుమారి తదితరులు ఉన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన ఆటో

తప్పిన పెను ప్రమాదం... ఆటోలో స్కూల్ పిల్లలు

ప్రమాదకర స్థాయికి కోన రోడ్డు... పట్టించుకోని పాలకులు

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : మండలంలోని కోన రహదారిలో ఆటో అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. శివగంగ ప్రాంతంలో కాన్వెంట్ నుండి 20 మందికి పైగా చిన్నారులతో కోన గ్రామం వెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి పక్కకు ఒరిగింది. ఆటోలో 20 మందికి పైగా చిన్నారులు ఉండగా ఎవరికి గాయాలు కాలేదు. ప్రమాదాన్ని గమనించిన కృష్ణా విశ్వవిద్యాలయం సిబ్బంది ఆటోలో ఇరుక్కుపోయిన పిల్లలను బయటకు తీసుకొచ్చారు. కోన రహదారి పెద్దపెద్ద గుంతలతో ప్రమాదకరంగా మారినా పాలకులకు ఏమాత్రం పట్టడం లేదని దిగువ గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దిగువన పోలాటితిప్ప, పాతేరు, పల్లితుమ్మలపాలెం, కోన గ్రామాలు ఉన్నాయి. అయినా రోడ్డు విస్తరణపై ప్రజాప్రతినిదులు దృష్టి సారించకపోవడం శోచనీయం. ఈ మార్గంలో భారత్ సాల్ట్ పరిశ్రమ లారీలు, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ విస్తరణ కోసం కొండరాళ్ళు, బండరాళ్ళు లారీలు, చేపల చెరువులు కోసం తీసుకొచ్చే ఫీడ్ లారీలుతో రోడ్డు అధ్వాన్నంగా తయారైంది. ఇప్పటికైనా పాలకులు కళ్ళు తెరవాలని ఆశిస్తున్నారు.

పెనుగంచిప్రోలులో ఇసుక లారీ పట్టివేత

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : అక్రమంగా తలిస్తున్న ఇసుక లారీని శనివారం తెల్లవారుఝామున పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ ఎస్ ఐ కి రాబడిన సమాచారం మేరకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రము నుండి హైదరాబాద్ కి ఇసుకను ఏ విధమైన అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఒక లారీతో పాటుగా లారీ డ్రైవర్ రామిశెట్టి రామకృష్ణ మరియు లారీ యజమాని తాటి గోపాలకృష్ణ అను వారిద్దరిని కొణకంచి అడ్డ రోడ్డు వద్ద వారి సిబ్బంది సహాయంతో అదుపులోనికి తీసుకుని వారిద్దరిపై కేసు నమోదు చేశారు.

గుడ్లవల్లేరు తహసీల్దార్ పదవీ విరమణ

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండల తహసీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న తిమ్మరాజు మల్లికార్జున రావు శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పాల శీతలీకరణ కేంద్రంలోని సమావేశ భవనంలో తహసీల్దార్ మల్లికార్జునరావు కు పదవీ విరమణ సన్మాన సభ కార్యక్రమాన్ని రెవిన్యూ సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మల్లికార్జున రావు దంపతులను రేషన్ డీలర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుడ్లవల్లేరు మండల డిప్యూటీ తహశీల్దార్ కనకదుర్గ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ షకీలా బేగం, మండల విద్యాశాఖాధికారి గోపాలరావు,మండల సర్వేయర్ రామకృష్ణ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో టొయోటా కిర్లోస్కర్ మోటర్ భాగస్వామ్యం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వినియోగదారులకు సమగ్రమైన వాహన ఫైనాన్సింగ్ పరిష్కారాలను అందించటం కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం) భాగస్వామ్యం చేసుకుంది. కస్టమర్‌ల అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడం, టొయోటా వాహనాలను గతంలో కంటే మరింత మెరుగ్గా అందుబాటులోకి తీసుకురావడానికి ఆకర్షణీయమైన పరిష్కారాలను అందించడం ఈ భాగస్వామ్యం లక్ష్యం. దీనిలో భాగంగా వ్యక్తిగత వినియోగం కోసం కొనుగోలు చేసిన ఏదైనా టొయోటా వాహనాల ఆన్-రోడ్ ధరపై 90 శాతం వరకు ఫైనాన్సింగ్‌ను అందించనున్నారు. అలాగే యూనియన్ వెహికల్ స్కీమ్ కింద సంవత్సరానికి 8.80 శాతం నుండి ప్రారంభమయ్యే ప్రస్తుత వడ్డీ రేట్లతో 84 నెలల వరకు సౌకర్యవంతమైన ఈఎంఐ సదుపాయాలను వినియోగించుకోవచ్చు. వీటితో పాటుగా యూనియన్ పరివాహన్ పథకం కింద వాణిజ్య వాహనాల కోసం 60 నెలల వరకు ఫైనాన్సింగ్ అవకాశాలు అందిస్తారు.

జోరు వానలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : అకస్మాత్తుగా సంభవించిన భారీ వర్షాల వల్ల సంబవించే ప్రకృతి విపత్తు నుంచి ప్రజలను కాపాడేందుకు జిల్లా కలెక్టర్ డా.జీ.సృజన తీవ్రంగా శ్రమిస్తున్నారు. శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షంతో జలమయమైన ప్రాంతాల్లో శనివారం కలెక్టర్ విశ్రాంతి లేకుండా పర్యటించారు. జిల్లాలోని వాగులు, వంకలు, కాలువలు వర్షపు నీటితో పోటెత్తటంతో తీవ్ర వర్షాల కారణంగా ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వారి సమస్యలు తెలుసుకునేందుకు కాల్ సెంటర్ ఏర్పాటు చేసి సహాయక చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేశారు. మొగల్రాజపురం సున్నపు బట్టీలు సెంటర్ ప్రాంతంలో కొండ చరియలు విరిగిపదిన ప్రదేశాన్ని పరిశీలించి మృతి చెందిన వారి కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు పొంగిపొర్లడంతో నందిగామ-చందర్లపాడు మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించయని ఆమె తెలిపారు. పెనుగంచిప్రోలు-నందిగామ, పెనుగంచిప్రోలు-జగ్గయ్యపేట మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో ఆయా మార్గాలలో ప్రజలు రాకపోకలు సాగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భారీ వర్షాలు మరో ఒకటి, రెండు రోజులు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు రేయింబవళ్లు అప్రమతత్తతో ఉండి ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చిన తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలు అప్రమత్తం : ఎస్ఐ అర్జున్

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తం గా ఉండాలి అన్ని ఎస్ఐ అర్జున్ అన్నారు. వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు తమ ప్రయాణాలను రద్దు చేసుకోవాలని, ప్రమాదాలు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావద్దన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షి త ప్రాంతాలకు చేరుకోవాలని అన్నారు.

వీఆర్వోకు సత్కారం

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని భూషణగుళ్ళ గ్రామ రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న తుర్లపాటి భగవంతు రావు ఉద్యోగ విరమణ సభ ఏ ఎన్ ఆర్ కాలేజీ కొల్లి జిమ్నాషియం హాలులో శనివారం జరిగింది. ఈ సభకు మండల ఈ ఓ పి ఆర్ డి వంగ శ్రీనివాస్ (వంశీ)అధ్యక్షత వహించారు. మండల తహసిల్దార్ రంగారావు, ఎంపీడీవో సీతామహలక్ష్మిలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బొడ్డు శ్రీనివాస్, డిటి వాణి, ఎంపీడీవో ఏవో రమణారావు, ఎన్నారై కొల్లి శ్రీనివాస్, టిడిపి సీనియర్ నాయకుడు కొల్లి రమణ కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చొరవతో సైకిల్ స్టాండ్

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని కూచిపూడి శ్రీ సిద్దేంద్ర ఓరియంటల్ జిల్లా పరిషత్ పాఠశాలలో 1984-85 పదవ తరగతి విద్యార్థుల బృందం సహకారంతో ఏర్పాటు చేసే సైకిల్ స్టాండ్‌కు భూమి పూజ చేశారు. పాఠశాలకు పెదపూడి, కూచిపూడి, బార్లపూడి తదితరప్రాంతాల నుంచి సైకిళ్ళపైవచ్చే విద్యార్థుల కోసం సైకిల్ స్టాండ్ అవసరాన్ని గుర్తించి సుమారు రూ.1.80 లక్షలతో సేకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గుంటూరు వెంకట సత్య ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయాలలో శనిత్రయోదశి అభిషేకాలు



విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో శని త్రయోదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం త్రయోదశి అమావాస్య ముందు రావటంతో ఈతిథికిఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. దేవాలయాల్లోని శనీశ్వరుని విగ్రహానికి తైలాభిషేకం, నల్ల నువ్వులతో పూజలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు పెనుమూడి సతీష్ కుమార్ శర్మ, పెనుమూడి పూర్ణ చంద్రశేఖరశర్మలు అభిషేకాలు నిర్వహించారు. మొవ్వ, గూడపాడు, మొవ్వ పాలెం, కోసూరు, కాజ, నిడుమోలు, చినముత్తేవి, అయ్యంకి, పెదపూడి శివాలయాల్లో, కూచిపూడి రామాలయంలో, పెదసనగల్లు వెంకటేశ్వర స్వామి దేవాలయాలలోని నవగ్రహాల మండపాలలో భక్తులు పూజలు చేశారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో టొయోటా కిర్లోస్కర్ మోటార్ భాగస్వామ్యం

విశాలాంధ్ర-గుంటూరు: వినియోగదారులకు సమగ్రమైన వాహన ఫైనాన్సింగ్ పరిష్కారాలను అందించటం కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) భాగస్వామ్యం చేసుకుంది. కస్టమర్ల అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడం, టొయోటా వాహనాలను గతంలో కంటే మరింత మెరుగ్గా అందుబాటులోకి తీసుకురావడానికి ఆకర్షణీయమైన పరిష్కారాలను అందించడం ఈ భాగస్వామ్యం లక్ష్యం. దీనిలో భాగంగా వ్యక్తిగత వినియోగం కోసం కొనుగోలు చేసిన ఏదైనా టొయోటా వాహనాల ఆన్-రోడ్ ధరపై 90 శాతం వరకు ఫైనాన్సింగ్‌ను అందించనున్నారు. అలాగే యూనియన్ వెహికల్ స్కీమ్ కింద సంవత్సరానికి 8.80 శాతం నుండి ప్రారంభమయ్యే ప్రస్తుత వడ్డీ రేట్లతో 84 నెలల వరకు సౌకర్యవంతమైన ఈఎంఐ సదుపాయాలను వినియోగించుకోవచ్చు. వీటితో పాటుగా యూనియన్ పరివాహన్ పథకం కింద వాణిజ్య వాహనాల కోసం 60 నెలల వరకు ఫైనాన్సింగ్ అవకాశాలు అందిస్తారు.

పెడన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

విశాలాంధ్ర-పెడన: పెడన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో అక్రమ లేఅవుట్లపై చర్చించారు. ఈ చర్చల్లో కౌన్సిలర్లు కటకం ప్రసాద్ గరిక ముక్కు చంద్రబాబు మెట్ల గోపి ప్రసాద్ మట్టా శివపావనిలు పాల్గొన్నారు. సమావేశంలో అక్రమ లేఅవుట్లను అరికట్టాలని నిర్ణయించారు. అక్రమ లేఅవుట్ లో బోర్డులు ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు బోర్డులు ఏర్పాటు చేస్తే ప్లాట్లు కొనుగోలుదారులు మోసపోకుండా ఉంటారని సమావేశం అభిప్రాయపడింది. అక్రమ ట్యాపులను కూడా అరికట్టాలని జనసేన కౌన్సిలర్ మట్టా.శివ పావని కోరారు అజెండాలోని 9 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించారు. నూతన మున్సిపల్ కమిషనర్ ఎం గోపాలరావును చైర్పర్సన్ సభకు పరిచయం చేశారు. కాగా మాజీ కౌన్సిలర్ బల్ల త్రిమూర్తి మృతి పట్ల సమావేశం సంతాపం ప్రకటించింది ఆయన మృతికి సానుభూతిగా సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించింది వెంకటేశ్వరరావు ఏఈ రామాంజనేయులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరి కిషోర్ సీనియర్ అసిస్టెంట్ కేడీఎస్ సుందరం తదితరులు పాల్గొన్నారు.

నాగరాజు కుటుంబానికి సీపీఐ నాయకుల పరామర్శ

విశాలాంధ్ర-మచిలీపట్నం : గూడూరులో ఇటీవల కృష్ణాష్టమికి కోలాటం ఆడుతూ మృతి చెందిన దొక్కు నాగరాజు కుటుంబ సభ్యులను శనివారం సీపీఐ నాయకులు పరామర్శించారు. సీపీఐ కంట్రోల్ కమిషన్ సభ్యులు మోదుమూడి రామారావు, సీపీఐ పెడన నియోజకవర్గ కార్యదర్శి పేరిశెట్టి ఉమాకాంతం, పెడన పట్టణ కార్యదర్శి తుమ్మ చిన్న కొండయ్య, మహిళా సమాఖ్య సభ్యురాలు మోదుమూడి అరుణకుమారి పరామర్శించిన వారిలో ఉన్నారు.

ప్రపంచశాంతి కోసం కృషిచేద్దాం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రకృతి, పర్యావరణంపై ప్రేమ కనబరుస్తూ ప్రపంచశాంతి కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని నిర్మల్ ధ్యాన్ ప్రోగ్రాం అంతర్జాతీయ నిపుణులు యోగేష్ అగర్వాల్ పిలుపునిచ్చారు. మాతాజీ నిర్మలాదేవి ప్రవేశపెట్టిన సహజయోగ ధ్యానంపై రాష్ట్ర దేవాదాయశాఖ సహకారంతో విజయవాడ ఒన్‌టౌన్‌లో సివిరెడ్డి చారిటీస్‌లో జాతీయస్థాయి వర్క్‌షాప్ శనివారం ప్రారంభమైంది. రాష్ట్ర దేవాదాయశాఖ, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, పరమపూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో 'నిర్మల్ ఇంటర్నేషనల్ లీడర్స్ అకాడమీ (నీలా) పేరుతో ఈ వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. సహజయోగ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ కల్లూరు రామకృష్ణ అధ్యక్షతన ప్రారంభమైన ఈ వర్క్‌షాపు నుద్దేశించి ముఖ్యఅతిథిగా అగర్వాల్ మాట్లాడారు. సహజయోగాను ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేయటానికి నిర్మల్ ధ్యాన్ ప్రోగ్రామ్ (ఎన్‌డిపి), నిర్మల్ ఇంటర్నేషనల్ లీడర్స్ అకాడమీ (నీలా), నిర్మల్ డాక్టర్స్ ప్రోగ్రామ్ (ఎన్‌డిపి), యంగ్ సహజ యోగ లీడర్స్ ప్రోగ్రామ్ (వైఎస్‌ఎల్‌పి) కార్యక్రమాలు పెద్దఎత్తున జరుగుతున్నాయన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కెఎస్ రామారావు మాట్లాడుతూ సహజయోగ సామూహిక ధ్యానం చేయటం ద్వారా ఆధ్యాత్మికంగా ఉన్నతిని పొందొచ్చునన్నారు. సహజయోగ ధ్యాన కేంద్రం ఏపి స్టేట్ కోఆర్డినేటర్ కల్లూరు రామకృష్ణ, ఎన్‌ఎస్‌పిటి సౌత్ ఇండియా కోఆర్డినేటర్ కె.సుభాషిణి, సహజయోగ ట్రస్ట్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.వి.రామ్మోహనరావు, మహిళా విభాగం కోఆర్డినేటర్ సుగ్గుల సుధారాణి, ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్ యర్రంశెట్టి గాంధీ, విజయవాడ సిటీ కోఆర్డినేటర్ టి.రవీంద్రబాబు పర్యవేక్షించారు.

మురిసిన క్రెడాయ్ సౌత్ కాన్ 2024

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) తమ అంతర్గత సౌత్ కాన్ 2024 కార్యక్రమాన్ని నిర్వహించింది. ఐదు దక్షిణాది రాష్ట్రాలు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ నుండి అగ్రశ్రేణి బిల్డర్లు పాల్గొనటంతో పాటుగా రియల్ ఎస్టేట్ అభివృద్ధి యొక్క భవిష్యత్తు గురించి మేధోమథనం చేశారు. ఈ కార్యక్రమంలో చర్చించిన ప్రధాన అంశాలలో ఒకటిగా అధునాతన, హరిత సాంకేతికతతో భవిష్యత్ నగరాలను నిర్మించేటప్పుడు సస్టైనబిలిటీ ఆవశ్యకత నిలిచింది. క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్ బోమన్ ఇరానీ, హైడ్రోమో సీఈఓ పరమ్ కె, హైడ్రోమో మేనేజింగ్ డైరెక్టర్ ప్రణీత ఠాకూర్, హైడ్రోమో గ్రోత్ అండ్ స్ట్రాటజీ డైరెక్టర్ నందిత కన్వర్, ఆపరేషన్స్ సీనియర్ మేనేజర్ వి భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫియోనా రిఫైన్డ్ ఆయిల్ ను మార్కెట్ లో విడుదల చేసిన లావణ్య త్రిపాఠి, వినయ్ శ్రీవాస్తవ- వైస్ ప్రెసిడెంట్ & బిజినెస్ హెడ్,బిబిని, బంగే ఇండియా

విద్యుత్తు షాక్‌తో యువకుడి మృతి

విశాలాంధ్ర-కృత్తివెన్ను : విద్యుత్‌షాక్‌తో యువకుడు దుర్మరణం పాలైన సంఘటన మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాన రామాంజనేయులు 35 పచ్చగడ్డి కోసెందుకు గ్రామంలో ఉన్న చేపల చెరువు వద్దకు వెళ్లాడు. చేపల చెరువు కట్టపై పచ్చగడ్డి కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో కరెంట్ షాక్ కొట్టి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజలు అప్రమత్తం

విశాలాంధ్ర-తిరువూరు: లక్ష్మీపురం- మల్లెల గ్రామాల మధ్య అలుగుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు రహదారులను వాహనాలను పోనివ్వకుండా ఆపడం జరిగింది. తిరువూరు అక్కపాలెం రహదారి మధ్యన వాగు దృశ్యతతో రహదారిని నిలిపివేయడం జరిగింది. తిరువూరు కొంకంపాడు రహదారి కూడా మునిగే సూచనలు ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలియజేశారు. వాగుల వద్ద వరద ఉధృతిని పర్యవేక్షించిన-సర్కిల్ ఇన్స్పెక్టర్ కే గిరిబాబు, ఎస్సై సత్యనారాయణ ప్రజల అప్రమత్తంగా ఉండాలని తగు జాగ్రత్తలు తీసుకొని ఇంటి నుంచి బయటకు రావద్దని కోరారు. కాలవలు చెరువులు ప్రవహించే ప్రదేశాల్లో సంచరించొద్దని ఆదేశాలు జారీ చేశారు. వరద నీరు ప్రవహించే లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తం

విశాలాంధ్ర -పమిడిముక్కల: మండలంలో వర్షాలకు రహదారులు, మురుగు కాలువలు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. తహసిల్దార్ నవీన్‌కుమార్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవిన్యూ కార్యాలయం లో కంట్రోల్ రూమ్ నెంబర్: 9652182211 ఏర్పాటు చేశామన్నారు.

మండలంలో రవాణా వ్యవస్థ చిన్నాభిన్నం

విశాలాంధ్ర-వీరులపాడు: అల్పపీడన ద్రోణి వాయుగుండంగా మారిన తరుణంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ నుండి అతి భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో వీరులపాడు మండలంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. కట్టలేరు పొంగిపొర్లటంతో రంగాపురం గ్రామంతో జుజ్జూరు గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. వెల్లంకి నుండి కొణతలపల్లి కి, దాములూరు కూడలి వద్ద చప్టా పై వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి.

భారీ వర్షాలకు నందిగామ అతలాకుతలం

విశాలాంధ్ర-నందిగామ: అల్ప పీడనద్రోణితో కురుస్తున్న భారీ వర్షాలకు నందిగామ మండలంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆయా గ్రామాల నల్ల వాగు వరద పరిస్థితిని ఆర్డీఓ రవీంద్ర, తాసిల్దార్ సురేష్ బాబు ఆర్ ఐ వేణికుమారి సిబ్బందితో పరిశీలించారు.

శారద (ఇంటర్మీడియట్) విద్యా సంస్థల 10 వసంతాల ప్రెషర్స్ డే " సందడి

విశాలాంధ్ర విజయవాడ ఎడ్యుకేషన్ : విజయవాడ, మొగల్రాజపురంలో ఉన్న శారద విద్యా సంస్థల" ప్రెషర్స్" సెలబ్రేషన్స్ 31.08.2024 న, కన్వెన్షన్ హాల్లో ఎంతో ఘనంగా జరిగాయి. ఈ సభకు ముఖ్య అతిథిగా కె.జి.వి. సరిత (సూపరింటెండ్ ఆఫ్ పోలీస్, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్), సి.హెచ్ కుటుంబరావు (ఫార్మర్ వైస్ చైర్మన్ ఆఫ్ ప్లానింగ్ కమీషన్), కోనేరు హంపి (ఉమెన్స్ వరల్డ్ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్) గౌరవ అతిథులుగా విచ్చేశారు. సభాధ్యక్షులు కళాశాల చైర్మన్, డాక్టర్ వై రమేష్ బాబు మాట్లాడుతూ గడచిన 10 సంవత్సరాల నుండి కేవలం డెస్కాలర్స్ విద్యా సంస్థగానే, తమ విద్యార్థులు నుండి అత్యు త్తమ ఫలితాలను సాధించి, మంచి మెడికల్ మరియు ఇంజని రింగ్ కాలేజిలలో సీట్లు సంపాదిస్తూ పదవ వసంతంలోకి అడుగు పెట్టడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కె.జి.వి. సరిత మాట్లాడుతూ "శారద విద్యాసంస్థలు - విలువలతో కూడిన విద్య మన అందరి లక్ష్యం కావాలి అనే మాట కాలేజి బ్యానర్పై చూసి తనకు ఎంతో సంతోషం కలిగిందన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన సి. హెచ్ కుటుంబరావు, మేనేజింగ్ డైరెక్టర్ వై. శారదాదేవిలు మాట్లాడుతూ తమ విద్యార్థులు సాధించిన జెఇఇ మెయిన్స్ మరియు నీట్ ప్రవేశ పరీక్షల ఫలితాలు, వారు పొందిన మెడికల్ అండ్ ఇంజనీరింగ్ సీట్ల వివరాలతో గడచిన 10 వసంతాల అనుభవాలతో మరెన్నో వసంతాలతో కళాశాల అభివృద్ధికి మరింత తమ వంతు కృషి చేస్తామని కళాశాల జి.యమ్. జి.వి.రావు తమ కళాశాల వార్షిక నివేదికను సమర్పించారు.

చవితి పందిళ్లకు సింగిల్ విండో సిస్టమ్ : సీఐ ఈశ్వరరావు

విశాలాంధ్ర-చల్లపల్లి : ఈ ఏడాది గణేష్ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని సీఐ కె.ఈశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా ఎస్.పీ ఆర్.గంగాధర రావు ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ పందిళ్లకు సింగిల్ విండో సిస్టమ్ ద్వారా అనుమతి ఇస్తున్నట్టు తెలిపారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల పరిధిలోని గ్రామాల్లో చవితి పందిళ్ళు, దేవాలయాల ఎదుట ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఉత్సవాలు నిర్వహించే కమిటీల ప్రతినిధులు https://ganeshutsav.net లాగిన్ అవ్వాలని, లేదా 7995095800 నంబరుకు హాయ్ అని వాట్సాప్ మెసేజ్ చేయాలని సూచించారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల పరిధిలోని గ్రామాల్లో చవితి వేడుకలు ఉత్సవ కమిటీల ప్రతినిధులు సంబంధిత అన్ని శాఖల అధికారులను కలిసే అవసరం లేకుండా అన్ని అనుమతులు ఒకేచోట లభించేలా సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు మంజూరు చేయాలని జిల్లా ఎస్పీ గంగాధరరావు నిర్ణయించినట్లు సీఐ తెలిపారు.

ముసురుతో... ఎడతెరిపి లేని వాన

గుడివాడ బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు, నిండు కుండల మారిన ఏకొండూరు చీమలపాడు పెద్ద చెరువు

విశాలాంధ్ర-గుడివాడ : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండంతో గుడివాడ పట్టణ, పరిసర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అంతర్గత డ్రైన్ల నుండి భారీగా వర్షపు నీరు వస్తుండటంతో చింతల కాలువ పొంగి ప్రవహిస్తోంది. స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియం సమీపంలోని ఆంజనేయ రెస్టారెంట్ సెంటర్ వద్ద గల చప్టాను దాటి నీరు ప్రవహిస్తోంది.

పొంగిన వాగులు స్తంభించిన రాకపోకలు

విశాలాంధ్ర-ఏ కొండూరు : మండలంలో భారీ వర్షాలుకు వాగులు పొంగి ప్రవహిస్తూ ఉండగా చెరువులు నిండు కుండలా మారాయి. గ్రామాల నుండి వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తూ ఉండటంతో రాకపోకలు స్తంభించాయి. ఏ కొండూరు అడ్డ రోడ్డు నుండి విస్సన్నపేట కు వెళ్ళే రోడ్డు పై కుమ్మరి కుంట తండా సమీపాన వాగు పొంగ టంతో అమర్గమలో రాకపోకలు నిలిచి పోయాయి అలానే రేపూడి నుండి పుల్రాల వెళ్లే రహదారి పై సీతమ్మ వాగు పొంగ టంతో ఆ మార్గంలో రకా పోకలు స్తంభించాయి. చీమలపాడు నుండి వినగడ వెళ్లే మార్గంలో చీమలపాడు పెద్దా చెరువు అలుగు పెద్దా తండా సమీపంలో పొంగి ప్రవహిస్తూ ఉండటంతో రాకపోకలు స్తంభించి ప్రయాణికులు త్రీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

విశాలాంధ్ర-గన్నవరం: భారీ వర్షాలతో పట్టణంలోని గౌడపేట తొడపాడు చెరువు నిండి ఇళ్లలోకి నీరు చేరి జలమైన ప్రాంతాలలో బాధితుల ఇబ్బందుల పోలీస్ స్టేషన్, బస్ స్టాండ్,యం డి ఓ కార్యాలయం ,కొత్తపేట, తోడేపడు చేరు నిండి గౌడపేట చెంచులు కాలనిలో ని పల్లపు ప్రాంతంలో నీళ్లు చేరుతున్నాయి.

నీట మునిగిన ప్రధాన రహదారులు

విశాలాంధ్ర-కూచిపూడి : వర్షాలతో మొవ్వ మండలంలోని రహదారులు వర్షపు నీటితో మునిగాయి. ప్రధాన రహదారులు జలమయమైనాయి. మొవ్వలో బందరు వెళ్లే ప్రధాన రహదారి నేత మునిగింది. కూచిపూడి బస్ స్టేషన్ లో వర్షపు నీరు ప్రవహిస్తోంది. అలాగే. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్దేంద్ర యోగి కూచిపూడి

కూచిపూడిలో ప్రధాన రహదారిపై పొంగి పొర్లుతున్న నీరు

నాట్య కళా పీఠం, శ్రీ సిద్దేంద్ర ఓరియంటల్ జిల్లా పరిషత్ పాఠశాల లో మీరునిలచికాలవలనుతలపింపచేస్తున్నాయి మండలంలోని పల్లపు పొలాలు నీట మునిగాయి.

పెనుగంచిప్రోలు-లింగగూడెంకి రాకపోకలు నిల్

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు పెనుగంచిప్రోలు లింగగూడెం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. లింగగూడెం గండివాగుకు భారీ వరద వస్తుంది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కాలినడక కూడా లింగగూడేం వెళ్లే పరిస్థితి లేదు. వరద తగ్గే వరకు పరిస్థితి ఇలాగే ఉంటుంది.

ప్రజలు అప్రమత్తం : తహశీల్దార్ రాజకిషోర్

విశాలాంధ్ర-వీరులపాడు: భారీ వర్షాలతో మండల తహశీల్దార్ రాజకిషోర్ ప్రజలను అప్రమత్తం చేశారు. భారీ నుండి అతి భారీ వర్ష సూచన ఉన్న తరుణంలో ఎవరూ ఇంటి నుండి బయటికి రావొద్దని, ప్రయాణాలు వుంటే వాయిదా వేసికోవాలని సూచించారు. వీఆర్ వో, వీఆర్‌ఏ లను అప్రమత్తం చేసారు. అల్లూరు గ్రామనికి చెందిన మల్లెల రాఘవేంద్రరావు, కొండల బాలకృష్ణలు ఉదయం 6:30 గంటలకు ఏనుగు గడ్డ వాగు దాటి పొలం చూడటానికి వెళ్లారు, తిరికి వచ్చే సరికి వాగు పొంగిపొర్లు తుండటంతో వాగు దాటలేని పరిస్థితి ఏర్పడింది. గ్రామస్తులు రెవిన్యూ వారికి సమాచారం ఇవ్వడంతో తహశీల్దార్ రాజకిశోర్ అప్రమత్తమై కంచికచర్ల అగ్నిమాపక దళాన్ని పిలిపించారు. ఏనుగు గడ్డ వాగు ఆవల చిక్కుకున్న ఇరువురి యోగక్షేమాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారిని రక్షించే ఏర్పాట్లను దగ్గరుండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. చిక్కుకున్న ఇరువురు దగ్గరలో ఉన్న రంగాపురం గ్రామానికి చేరుకోవటం తో వారితో ఫోన్ స్వయంగా మాట్లాడి వారి క్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఈవో

విశాలాంధ్ర-కంచికచర్ల : చెవిటికల్లు మొగులూరు వద్ద ముంపు ప్రాంతాల ను శనివారం పరిశీలించిన కంచికచర్ల పంచాయతీ ఈవో వరద బోయిన బ్రహ్మం.లక్ష్మయ్య వాగు వద్ద ప్రయాణికులతో మాట్లాడుతూ నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల వాగును ఎవరు దాటవద్దని ప్రయాణి కుల అప్రమత్తంగా ఉండాలని ఈవో తెలిపారు.నడుం లోతు నీటిలో తిరిగి వరద బాధితుల సమస్యలు తెలుసు కొని వారి సమస్యలు ఉన్నతాధి కారులకు తెలియజేసిన ఈవో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

రోడ్లన్నీ జలమయం

భారీ వర్షాలకు కంచికచర్ల లో రహదారులన్నీ జల మయ మయ్యాయి. శనివారం స్థానిక చికెన్ మార్కెట్ నందు చెరువును తలపిస్తున్న వర్షపు నీరు చికెన్ షాప్ లోకి నీరు చేరి కోళ్ల మృత్యువాత పడుతున్నాయి. వ్యాపారాలు లబోదిబోమంటు న్నారు.మాంసం కాలవలో పూడిక తీయక పోవడం తో వర్షపు నీరు చెరువును తలపిస్తున్నాయి. జుజ్జురురోడ్డు కాలువను తలపి స్తుంది అన్ని రహదారులలో ద్విచక్రవాహనాలు నీటమునిగాయి ఏ రోడ్డు లోను వెళ్లే మార్గము లేకుండా పోయింది.

పింఛన్ల పంపిణి : ఎమ్మెల్యే కాగిత

విశాలాంధ్ర-బంటుమిల్లి :- రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల పట్ల ఎంతో బాధ్యతగా చిత్తశుద్ధితో పనిచేస్తుందని, అర్హులైన పేదలం దరికీ పింఛను అందించి ఆదుకో వడమే లక్ష్యమని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని పెదతుమ్మిడి, మలపరాజుగూడెం గ్రామాలలో శనివారం ఉదయం కాగిత కృష్ణప్రసాద్ చేతులమీదుగా అర్హులైన వారికి ఇంటింటికి వెళ్ళి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణిచేసారు.

వర్షంలోనే పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : ఒకపక్క కుండపోతగా కురుస్తున్న వర్షంలో తడుస్తూనే శని వారం ఉదయం నుంచి సచివాలయ సిబ్బంది ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు ప్రభుత్వ ఉద్యోగులు పంపిణీ చేస్తుండటంతో గ్రామాలలో ఒకరోజు ముందుగానే పెన్షన్ల పండగ వచ్చినా సిబ్బంది మాత్రం తీవ్ర ఇబ్బందులపాలైనారు. తెలుగుదేశం పార్టీ మండల శాఖ కార్యదర్శి వీరంకి తులసీదాస్ వెల్ఫేర్ అండ్ ఎద్యుకేషన్ అసిస్టెంట్ పి .ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన సచివాలయ సిబ్బంది

విశాలాంధ్ర-ఏ కొండూరు : మండలంలో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా సచివాలయ ఉద్యోగులు అంగన్వాడి కార్యకర్తలు వీడో ఒంటరి మహిళ వికలాంగ వృద్యప చర్మకారులు డప్పు కళాకారులు కిడ్నీ డయాలసిస్ తలసేమియా పెన్షన్లులను శనివారం మండలం లో ఉదయం నుంచి ప్రారంభించినట్టు ఏ కొండూరు మండల ఇన్చార్జి ఎంపిడిఓ శ్రీ కృష్ణా పరమాత్మ తెలిపారు.

పింఛన్లు పంపిణీలో ఎమ్మెల్యే యార్లగడ్డ

విశాలాంధ్ర-గన్నవరం : జోరువానను లెక్కచేయకుండా గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ శనివారం ఉదయం నియోజకవర్గం లో పింఛన్ ల పంపిణీ కార్యక్రమాన్ని పెద్ద ఆవుటపల్లి లో ప్రారంభించారు. సెప్టెంబర్ నెలకి సంబంధించిన 'ఎన్టీఆర్ భరోసా పింఛన్లు' ఒక రోజు ముందుగానే కూటమి ప్రభుత్వం పంపిణీ చేశారు. శనివారం గన్నవరం నియోజకవర్గం పెద అవుటపల్లి గ్రామంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పెన్షన్ల పంపిణి కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు అవ్వ తాతలకు ఎమ్మెల్యే నేరుగా పింఛన్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆరుమళ్ళ కృష్ణారెడ్డి, ఆళ్ళ హనుక్, మున్నా, రామ కృష్ణ, కుందేటి చంద్రశేఖర్ , కొండేటి వెంకటేశ్వరావు, కొండేటి కొండలు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 8 గంటలకే 100 శాతం పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : జోరు వర్షాలను సైతం లెక్కచేయకుండా ఎన్‌టిఆర్ భరోసా ఫెంక్షన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సచివాలయ పంచాయితీ సిబ్బంది పంపిణీ చేశారు. ఒక రోజు ముందుగానే శనివారం మండల పరిధిలోని వేకనూరులో ఉదయం నుండిఇ తనకు ఇచ్చిన 71 ఫెంక్షన్‌లకు ఉదయం 8 గంటలు అయ్యే సమయానికి 70 మందికి పెంక్షన్‌లు పంపిణీ చేసిన అశ్వరావుపాలెం గ్రామ సచివాలయ పంచాయితీ కార్యదర్శి గ్రేడ్ 6 డి పద్మావతి పంపిణీ చేశారు. మరోక ఫెంక్షన్ దారుడు మృతి చెందడంతో ఆమె ఇవ్వాల్సిన 71 ఫెంక్షన్‌లకు గానూ 70 ఫెంక్షన్‌లు పూర్తి చేయడంతో గత 3 నెలలుగా ఫెంక్షన్‌ల మొదటి రోజే మధ్యాహ్నా సమయానికి పంపిణీ పూర్తి చేయడంలో పలువురు కూటమి నేతలు అభినందనలతో ముంచెత్తారు

జాతులను అభివృద్ధి చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ధమాషా ప్రకారం మాకు రావాల్సిన దానిని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసి మా జాతులను అభివృద్ధి చేయాలని సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర అధ్యక్షులు గోరంట్ల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంచారజాతుల విమోచన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. బీసీలకు ఉన్న మాదిరిగా తమకు రక్షణ చట్టం కల్పిస్తామని ఇప్పటి ప్రభుత్వం ప్రకటించడం చాలా సంతోషం కానీ, బీసీలలో అట్టడుగు కులాలకు రక్షణ చట్టం కల్పించాలని, ఇప్పటికీ కొన్ని కులాలకు కుల సర్టిఫికెట్లు మంజూరు చేయడం లేదన్నారు. ఉదాహరణకు పెరమలై, కల్లర్, పత్రా, బేడ,బుడగ జంగం మొదలగు కొన్ని కులాలకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడం లేదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కటారి రవీంద్ర,కోశాధికారిమోపూరి సుబ్రహ్మణ్యం,ప్రధాన కార్యదర్శి తెల్లి వైకుంఠరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రొట్ట లక్ష్మి,నాయిని పెద్దన్న, పి.సుబ్రహ్మణ్యం,గోవిందు సంపంగి,తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర షూటింగ్ బహుమతులు పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ రాష్ట్ర షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు, 2024 కోసం బహుమతి పంపిణీ వేడుకను ఆగస్టు 31, 2024న విజయవాడలోని తాడేపల్లిలోని విజయవాడ క్లబ్‌లో విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ సలలిత్ తొట్టెంపూడి హాజర్రై, వేడుక ద్వారా ప్రేక్షకులకు మార్గదర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెవెన్యూ శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా హాజరయ్యారు. ఈ వేడుకలో ఛాంపియన్‌షిప్ నుండి 180 మంది పతక విజేతలు పాల్గొని, వారికి తగిన పతకాలను ప్రదానం చేశారు.

కాల్వలో కొట్టుకుపోయిన కారు..

ముగ్గురు మృతి

విశాలాంధ్ర-పెదకాకాని: మండల పరిధిలోని ఉప్పలపాడు సమీపంలో శనివారం గోళమూడి నుండి ఉప్పలపాడు వెళుతున్న సమయంలో కారు కాల్వలో కొట్టుకు పోవుటంతో ముగ్గురు మృతి చెందారు. వీరు ఉప్పలపాడు గ్రామానికి చెందిన నడింపల్లి రాఘవేంద్ర (38), సాత్విక్ (6), మాన్విక్ (9)గా గుర్తించారు. విషయం తెలిసిన పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఉప్పలపాడు వెళ్లి బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున అదుకుంటానని, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కొండరాయి పడి వృద్ధురాలి మృతి

విశాలాంధ్ర - మంగళగిరి: భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా మంగళగిరి పట్టణంలోని కొత్తపేటలో కొండ రాయి విరిగి ప్రక్కనే ఉన్న వృద్ధురాలిపై పడటంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. శనివారం రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిసిపోవడం వల్ల కొండ చరియలు విరిగి పడి పక్కనే ఉన్న వృద్ధురాలిపై పడింది. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించారు.

శివాలయంలో చోరీ

విశాలాంధ్ర-యడ్లపాడు : మండలంలోని చెంగిస్ ఖాన్ పేట గ్రామ శివాలయంలో చోరీ జరిగింది. ఎస్సై వి.బాలకృష్ణ సమాచారం మేరకు శుక్రవారం రాత్రి ఒంటి గంట నుంచి మూడు గంటల మధ్యలో దుండగులు తాళాలు పగలగొట్టి ఆలయం లోనికి ప్రవేశించి ఒకటిన్నర కేజీ వెండి, రెండు గ్రాముల అమ్మవారి మంగళసూత్రం అపహరించినట్లు తెలిపారు. నిందితుడు ఆలయంలోని సీసీ కెమెరాల కేబుల్ వైర్లు కట్ చేసి డీవీఆర్ బాక్స్‌ను కూడా దొంగిలించాడని వివరించారు. క్లూస్ టీం ఆలయం వద్దకు వచ్చి ఆధారాలు సేకరించే పనిలో ఉన్నట్లు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

విశాలాంధ్ర-నరసరావుపేట : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులను, సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి రెస్క్యూ కోసం కావలసిన అన్ని పరికరాలు దగ్గర పెట్టుకోవాలని ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పోలీసుల సహాయం కోసం 9440796184, 9154880760, 9154880761, 9490619394, 08647-229999 నెంబర్లకు ఫోన్ చేసి సమస్యను తెలియజేసి తక్షణ సహాయం పొందవచ్చునని కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

వాగులో కొట్టుకుపోయిన యువకుడు

విశాలాంధ్ర-తాడికొండ : వర్షం తెచ్చిన తంటా, లాం గ్రామ కొండవీటి వాగులో శనివారం వాగు ఉధృతికి గుర్తుతెలియని యువకుడు కొట్టుకుపోయాడు. లామ్ గ్రామానికి చెందిన అఫ్జల్ అనే వ్యక్తి కాపాడే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. ముళ్ళకంప చెట్లను పట్టుకొని తనను రక్షించాలని వేడుకుంటున్నాడు. చీకటి పడటంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు లైట్లతో అతనిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. రెస్క్యూ టీమ్ రంగంలోకి దిగింది. కొట్టుకుపోయిన యువకుడిని కాపాడే ప్రయత్నం అధికారులు చేస్తున్నారు. అంతకుముందు మరో ఇద్దరు యువకులను తాళ్లతో కాపాడినట్లు తెలిసింది.

జల దిగ్బంధంలో టిడ్కో గృహ సముదాయవాసులు

విశాలాంధ్ర - మంగళగిరి: చినుకు పడితే చాలు.. ఓ వైపు వర్షపునీరు.. మరోవైపు కాలువల్లో ప్రవహించే మురుగునీటితో మంగళగిరి నగరం లోనీ టిడ్కో గృహ సముదాయం చెరువును తలపిస్తోంది. సంవత్సరాలు గడుస్తున్నా, నాయకులకు, అధికారులకు ఎన్ని విన్నపాలు చేసుకుంటున్నా.. సమస్యకు పరిష్కారం చూపని పరిస్థితి నెలకొంది. మంగళగిరి నగరంలో ప్రభుత్వం పేదలకు నిర్మించిన టిడ్కో గృహాలలో 1728 కుటుంబాలు 54 బ్లాకులలో నివాసం ఉంటున్నారు.. కొద్దిపాటి వర్షానికే చెరువును తలపిస్తుంది. గత రెండు రోజులుగా మంగళగిరిలో కురుస్తున్న వర్షాలకు టిడ్కో రోడ్లన్నీ జలమయమయ్యాయి.. కనీసం బయటకి అడుగు వెయ్యలేని పరిస్థితి నెలకొంది. పాఠశాలకు వెళ్ళే విద్యార్థులు నుండి ఆఫీసులకు వెళ్ళే వాళ్ళు, రోజు వారీ పనులకి వెళ్ళే వాళ్ళు సైతం బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఆగిపోయారు.. వాహనదారులు, పాదచారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అధికారులు గృహాలు నిర్మించే సమయంలో సరైన ప్రమాణాలు పాటించలేదని నివాస బాధితులు పేర్కొంటున్నారు. ఇక్కడ నిర్మించిన రోడ్లు, కాలువలు కంటే గృహాలు ఎత్తుగా లేకపోవటంతో ఈ పరిస్థితి నెలకొందంటున్నారు. రోడ్లు ఫార్మేషన్, కాలువ నిర్మాణం ఇక్కడి వల్లానికి అనుగుణంగా నిర్మించి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి వచ్చేది కాదని నివాసులు పేర్కొన్నారు. ఇప్పటికే 20 రోజులుగా ప్రజలు జ్వరాలతో బాధ పడుతున్నారు. తాజాగా కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీ సమస్యతో పారిశుధ్యం మరింత క్షీణించి దోమలు ప్రబలుతాయని, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని నివాశితులు కోరుతున్నారు.

గుడ్లవల్లేరు ఘటన కారకులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఈ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారని గుంటూరు తూర్పు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా ఆరోపించారు. ఈ మేరకు శనివారం మంగళదాస్ నగర్లో ఉన్న క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ ఉదంతంలో కూటమి ప్రభుత్వ తీరుపై ఆమె విమర్శలు చేశారు. ఏపీలో డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయని ఆమె ఆరోపించారు. గుడ్లవల్లేరు ఘటనను డైవర్ట్ చేసేందుకే సీఎం చంద్రబాబు ముంబై నటి కేసును తెరపైకి తీసుకొచ్చారని విమర్శించారు. గుడ్లవల్లేరు కాలేజీలో 300 మంది ఆడ పిల్లలను వీడియో తీసిన వారి విషయంలో కూటమి ప్రభుత్వానికి శ్రద్ధ లేదు కానీ ముంబై నటి విషయంలో మాత్రం అత్యంత శ్రద్ధ పెడుతున్నారని మండిపడ్డారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ విద్యార్థినిలు బయటకొచ్చి గొంతెత్తి మాట్లాడుతుంటే వారి గొంతు నొక్కే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని, ఈ ఘటనను డైవర్ట్ చేసేందుకే ముంబై నుంచి పేటీఎం నటిని చంద్రబాబు తెరపైకి తీసుకొచ్చారని ఆమె విమర్శలు గుప్పించారు. ఈ ఘటనపై విచారణ జరిపి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

భారీ వర్షంలోనూ పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. సెప్టెంబర్ 1వ తారీఖున పంపిణీ చేయవలసిన పింఛన్లను, సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఒకరోజు ముందుగా ఆగష్టు 31వ తేదీన భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎన్టీఆర్ భరోసా పింఛన్లను కూటమి నాయకులు పంపిణీ చేశారు. పిడుగురాళ్ల పట్టణంలోని 6వ వార్డు, 7వ వార్డు, 8వ వార్డు, 10వ వార్డులకు చెందిన అవ్వతాతలకు, వితంతువులకు, విభిన్నప్రతిభవంతులకు శాసనసభ్యులు పింఛన్లను అందచేయటం జరిగింది. ఉదయం 12:30 సమయానికి 98 శాతం పెన్షన్లు పంపిణీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల పట్టణ మున్సిపల్ కమిషనర్ శ్రీధర్, ప్రభుత్వ సిబ్బంది, పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్-న్యూకాన్ ఏరోస్పేస్‌ల మధ్య అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విజ్ఞాన్స్ యూనివర్సిటీ - హైదరాబాద్‌లోని న్యూకాన్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్(ఎన్ఏపీఎల్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని శనివారం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్ఏపీఎల్ ఆర్ అండ్ డీ జనరల్ మేనేజర్ జేఎల్‌పీ తిలక్‌తో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన ఏరోస్పేస్ ఇంజనీరింగ్, డిఫెన్స్ టెక్నాలజీలకు సంబంధించిన రంగాలలో ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను సులభతరం చేయవచ్చునన్నారు. ప్రస్తుతం పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడానికి ఉమ్మడి శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు, ఇండస్ట్రీ-అకాడెమియా ఇంటరాక్షన్స్‌ను నిర్వహిస్తామన్నారు. వీటితో పాటు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం, ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవాన్ని అందించడంతో పాటు వృత్తిపరమైన వృద్ధిని పెంపొందిస్తామన్నారు. ఎన్ఏపీఎల్ ఉద్యోగుల కోసం ఎంటెక్ కోర్సును ప్రత్యేకంగా రూపొందించి వారిలో సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచడంతో పాటు విద్యా అర్హతలను పెంచుతామన్నారు. అంతేకాకుండా నిర్దిష్ట పరిశ్రమ అవసరాలను తీర్చడంతో పాటు విద్యా అనుభవాన్ని పెంచుకోవడానికి ఏరోస్పేస్ టెక్నాలజీస్‌లో న్యూకాన్ టైలర్డ్ మైనర్/హానర్/మాడ్యులర్ ప్రోగ్రామ్‌లను పరిచయం చేస్తామన్నారు. వీటితో పాటు న్యూకాన్ ఉద్యోగులకు పీహెచ్‌డీలో ప్రవేశంకు కూడా అవకాశం కల్పిస్తామన్నారు. ఎన్ఏపీఎల్ ఆర్ అండ్ డీ జనరల్ మేనేజర్ జేఎల్‌పీ తిలక్ మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదునివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఏపీఎల్ హెచ్ఆర్ విభాగాధిపతి అరవింద్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంట పొలాల రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర-పెదకాకాని : అకాల వర్షంతో దెబ్బతిన్న పంట పొలాలను సీపీఐ బృందం ఆధ్వర్యంలో శనివారం పరిశీలించటం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ పెదకాకాని నుంచి గోళ్ళమూడి వెళ్లే దారిలోని కొత్త కాలువ గట్టులు బలహీనపడి వర్షం వల్ల తెగిపోవడంతో పాటు మంచినీటి చెరువు కట్టలు కూడా తెగటం జరిగాయని, కాలవ గట్టు తెగిపోవడం వలన నీళ్లు పంట పొలాల్లోకి వచ్చి పంట పొలాలు మునిగిపోవడం జరిగిందన్నారు. దీనితో ఆరుగాలం కష్టించి పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సర కాలం నుంచి ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఈ కాలవను రిపేరు చేయటంలో అధికారుల నిర్లక్ష్య వైఖరి అవలంబించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాలవ గట్లకు మరమ్మత్తులు చేయించాలని నీట మునిగిన పొలాల రైతులకి నష్టపరిహారం ఇవ్వాలని, అలాగే ఈ కట్టలు తెగి నీరు రోడ్డుపై నిలువట వలన పెదకాకాని నుంచి గొల్లమూడి రహదారి రాకపోకలు స్తంభించిపోయాయని వెంటనే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలపాటి ప్రసాద్, కటారి శ్రీను, చిన్న నాగయ్య, పూల రవి తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

విశాలాంధ్ర-తాడేపల్లి: శుక్రవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో తాడేపల్లి పట్టణంలోని సుందరయ్య నగర్ విజయవాడ క్లబ్ రోడ్ కరకట్ట ప్రాంతం నివాస ప్రాంతాలలో వర్షం నీరు ఇళ్లలోకి చేరాయి. నివాస ప్రాంతాలు మొత్తం వర్షం నీటితో నిండిపోయాయి. దీనితో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవలసినదిగా వారు కోరుకుంటున్నారు.

ప్రకటన

మా క్లయింటు పల్నాడు జిల్లా, వినుకొండ పట్టణం నందు గల ది. వినుకొండ బులియన్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ (రి.నెం : 235/1991) ప్రెసిడెంట్ పెనుకొండ పాండు రంగారావు కుమారుడు షిరిడి సాయి సురేష్ అందించిన సమాచారం ప్రకారము యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

నా క్లయింటు వినుకొండ మున్సిపల్ పరిధిలో సర్వే నెం : 390/1-ఎ1లో 59.44 చ.గ.ల ఖాళీ స్థలమును ది: 19-09-1991న కొత్త పున్నారెడ్డి కుమార్తె భవనం బాలమ్మ వలన విక్రయ దస్తావేజు ద్వారా విక్రయం పొంది వినుకొండ ఎస్.ఆర్.ఒలో ద.నెం : 2210/1991 గా రిజిస్టర్ చేయించుకొని యున్నారు. ది. 30-08-2024 నా క్లయింటు వినుకొండ పట్టణములో ఆర్.టి.సి. బస్టాండ్ నందు సదరు ఒరిజినల్ ద.నెం. 2210/1991ను పోగొట్టుకొనియున్నారు. చుట్టుప్రక్కల ఎంత వెతికినను సదరు దస్తావేజు దొరికియుండలేదు. కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై ఒరిజినల్ ద.నెం : 2210/1991 ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకి అందజేయవలసినదిగా కోరడమైనది.

యలపర్తి శ్రీనివాసరావు, న్యాయవాది
ఇండియన్ బ్యాంకు వెనుక, కొత్తపేట, వినుకొండ టౌన్ & మండలం, పల్నాడు జిల్లా - 522647
సెల్ : 94408 35056
వినుకొండ : తేది : 31-08-2024

వరద ప్రాంతాల్లో సీపీఐ, వైసీపీ నాయకుల పర్యటన

విశాలాంధ్ర-తాడేపల్లి : ఇళ్లు నీట మునిగిన ప్రాంతాల్లో సిపిఐ నాయకులు వెంకటయ్య, వైసీపీ నాయకులు ప్రకాష్ పర్యటించారు. గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు తాడేపల్లిలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. ఈ సందర్భంగా తాడేపల్లిలోని సలాం సెంటర్ పోతురాజు గుడి, రన్నింగ్ రూమ్ సెంటర్లో నీట మునిగిన ఇళ్లను సిపిఐ తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి, వైసిపి నాయకులు ముదిగొండ ప్రకాష్ పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని, ఇళ్లు నీట మునిగి ప్రజల తీవ్రంగా నష్టపోయారని వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడం చాలా బాధాకరమన్నారు. వారికి పునరావస కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని అన్నారు.

స్తంభించిన జనజీవనం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: చిలకలూరిపేటలో భారీ వర్షాలతో జనజీవనం స్థంబించి పోయింది. శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతత్తు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలకు ప్రధాన పట్టణాల్లో డ్రైన్లు పొంగిపొర్లాయి. శనివారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సెలవు ప్రకటించారు. పలు కాలనీల్లో వర్షపు నీరు వచ్చి చేరింది. పలు ప్రాంతాల్లో భారీవృక్షాలు నెలకొరిగాయి.

బస్సుల రాకపోకలకు అంతరాయం

విశాలాంధ్ర-అమరావతి : వాయుగుండం కారణంగా గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు వల్ల అమ రావతి నుంచి విజయవాడ, సత్తెనపల్లి నుంచి అమరా వతి రోడ్లపై ఉన్న వాగులు పొర్లటంతో బస్సులు రాకపో కలకు అంతరాయం చోటుచేసుకుంది. దీని కారణంగా ఈ ప్రాంతంలో తిరిగే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అమరావతి మండల పరిధి లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిలవడంతో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి: కలెక్టర్

విశాలాంధ్ర-సత్తెనపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత లేకపోతే ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక ప్రభుత్వాసుపత్రిని సందర్శించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరి సరాలను కూడా తమ బాధ్యతగా శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వైద్యాధికారులు ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. మున్సిపల్ అధి కారులు పట్టణ శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదే శించారు. డిసిహెచ్ఎస్ డాక్టర్ మంత్రునాయక్, డిఎం హెచ్ఓ రవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమతెరలను వాడాలని చెప్పారు. తమ నివాసాల ముందు చెత్తను పడేయవద్దని, దోమల నిల్వ కుంటను గుర్తించి వాటిని పరిశుభ్రంగా ఉంచేలా

చూసుకోవాలని తెలిపారు. సత్తెనపల్లి పట్టణ, పరిసర గ్రామాల్లో జ్వర పీడితులు ఎక్కువగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇప్పటివరకు మలేరియా కేసులు, నమోదు కాలేదని ఆయన అన్నారు. టైఫాయిడ్, సీజనల్ జ్వరాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగించేలా కిందిస్థాయి అధికారులను ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రభుత్వాసు పత్రిలో రోగు లకు ఎటువంటి వైద్య సేవలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అనం తరం కలెక్టర్ అరుణ్ బాబు

పట్టణంలో ముంపు ప్రాంతాల సందర్శన

పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన సుందరయ్య కాలనీ, కొత్తపేటలను సందర్శించి కమిషనర్ షమ్మీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మురళీకృష్ణ, ఇన్చార్జ్ డిసిహెచ్ఎస్ మంత్రునాయక్, తహశీల్దారు ఫణి, పట్టణ సీఐ బ్రహ్మయ్య, రూరల్ సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం నందిగామ డొంక రోడ్డులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు వద్ద భద్రతా చర్యలు పరిశీలించారు.

మానవతా విలువలకు బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ ఉదయ శంకర్

విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (అప్త) మహోత్సవాలు ఇటీవల అమెరికాలో వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్స వాలకు అహల్య నర్సింగ్ హోమ్ ఫిజీషియన్ అండ్ జెరియాట్రీషన్ డాక్టర్ శనక్కాయల ఉదయ శంకర్ గెస్ట్ ఆఫ్ హానర్గా అప్త నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ సంద ర్భంగా అప్త నిర్వాహకులు డాక్టర్ ఉదయ శంకర్ చేసిన పలు సేవా కార్యక్రమాలను కొనియాడారు. డాక్టర్ ఉదయ శంకర్ చిన్న పిల్లలకు.. వయోవృద్ధులకు ఎంతో సాంకేతి కమైన వైద్యాన్ని అందించి ఎందరో జీవితాలకు సంజీవినిలా నిలిచారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలని.. వైద్యం అంద కుండా ఏ పేదవాడు బాధపడ కూడదని భావించి మాన వతా వాదంతో ఎన్నో ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వ హించారు. ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించడమే

అమెరికాలో ఆప్త నిర్వాహకులు సత్కారం

కాకుండా ఉచితంగా మందులు పంపిణీ చేస్తూ వైద్యో నారాయణుడు అయ్యారు. ఎన్నో సేవా కార్యక్రమాలకు వెన్నెముకలా ఉంటూ మానవ సేవే మాధవ సేవ అని చాటారు. మానవతా విలువలకు బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ శనక్కాయల ఉదయ శంకర్ అని అమె రికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (అప్త) నిర్వాహకులు కొనియాడారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు.

దళితవాడలోని 24 కుటుంబాలకు పునరావాసం

విశాలాంధ్ర-దుగ్గిరాల : అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైన పరిస్థితి నెలకొంది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు కురిసిన వర్షాల వలన దుగ్గిరాల మండలంలోని గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో వాన నీరు చేరి ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారు. దుగ్గిరాల చెన్నకేశవ నగర్, దళితవాడలో శనివారం టీడీపీ నాయకులు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ సిబ్బంది కలసి గృహాల్లో నీరు చేరిన పరిస్థితులను పరిశీలించి, 24 కుటుంబాలను ప్రాథమిక పాఠశాలలో పునరావాసం కల్పించి, వారికి కావలసిన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. కాలనీలో రోడ్లన్నీ నీట మునిగి, ప్రజలు బయటకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాయకులు, అధికారులు సహాయ చర్యలు చేపట్టడంతో సంతృప్తిని వ్యక్తంచేశారు. అదేవిధంగా గ్రామాల్లో వర్షాలు వల్ల ఇబ్బందిపడుతున్న ప్రజలకి సహాయక చర్యలను అందించాలని అధికారులను తహశీల్దార్ ఆదేశించారు. పేరుకలపూడిలో టీడీపీ నాయకులు ప్రభుత్వ పాఠశాలలో పలువురికి పునరావాసం ఏర్పాటు చేశారు. తహశీల్దార్ సునీత, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటరావు, నాయకులు వల్లూరు నరసింహారావు, దేవరపల్లి చంటి, పర్వతనేని హర్ష, నక్క చిరంజీవి, నాయుడు శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-మాచర్ల : తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండటంతో పల్నాడు జిల్లాను రెడ్ జోన్గా అధికారులు ప్రకటించారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి సూచించారు. ఎమ్మెల్యే జేబీఆర్ మాట్లాడుతూ ఎడతెరిప లేని వర్షానికి గ్రామాల్లో చెరువులు, కుంటలు నుంచి లోతట్టు రోడ్లపై వరద నీరు పొంగిపొర్లే అవకాశాలున్నాయన్నారు. వర్షానికి విద్యుత్ స్తంభాలు తడిచి ముద్దయ్యాయని వాటి వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శిథిలావస్థలో ఉన్న మట్టి మిద్దెలలో ఉండకుండా ప్రత్యామ్నాయ నివాసాన్ని చూసుకొని జాగ్రత్త వహించాలన్నారు. వరద బారిన పడ్డ ప్రజలను ఆదుకునేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

శ్రీవాణికి అవార్డుపై హర్షం

విశాలాంధ్ర-పెదనందిపాడు : నంబూరు వీవీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్గా విధులు నిర్వహిస్తున్న స్థానిక పీఏఎస్ కళాశాల ప్రిన్సిపాల్ గుర్రం వీర రాఘవయ్య సతీమణి ఆళ్ల శ్రీవాణికి ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్ అండ్ ఇన్నోవేషన్ అవార్డు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా శనివారం ప్రిన్సిపాల్ వీర రాఘవయ్య మాట్లాడుతూ ఒడిస్సాలోని భువనేశ్వర్ విగ్రో రీసెర్చ్ ఫౌండేషన్, కేఎంబి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ వారు ఈ అవార్డును అందజేసినట్లు తెలిపారు. కళాశాల అధ్యక్షులు కాళహస్తి సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి శ్రీనివాసరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

పోలీస్ కుటుంబాల సంక్షేమం కోసం

ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ సేవలు అభినందనీయం: ఎస్పీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పోలీసు కుటుంబాల సంక్షేమం కోసం ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ చైర్మన్, టిడిపి నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ చేస్తున్న వైద్య సేవలు అభినందనీయమని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ కొనియాడారు. శనివారం గుంటూరు నాజ్ సెంటర్లో ఉన్న ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్లో పోలీస్ సిబ్బందికి మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పోలీస్ కుటుంబాల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ చైర్మన్ డేగల ప్రభాకర్ వైద్య సేవలు చేయటం గొప్ప విషయమని ఆయన అన్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందని, హోమ్ గార్డ్స్, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సేవలు ఎంతైనా అవసరం అన్నారు. ఈ మెగా మెడికల్ క్యాంపు స్క్రీనింగ్ టెస్ట్, గైనకాలజీ, కార్డియాలజీ, ఆర్థోపెటిక్, ఆప్తమాలజీ, షుగర్ అండ్ థైరాయిడ్, న్యూరో, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్ తదితర విభాగాలకు చెందిన డాక్టర్ల బృందంచే పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళలకు వచ్చే సర్వికల్, గర్భాశయ, ఇతర క్యాన్సర్ లక్షణాలు, తీసుకోవలసిన మందుస్సు

జాగ్రత్తలు, వ్యాక్సిన్ల గురించి డాక్టర్లు అవగాహన కల్పించారు. అనంతరం ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది.. వారి ఆరోగ్య ప్రాధాన్యత కంటే ప్రజా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, నగరంలో ఇప్పటికే 70 మెగా ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అచ్చెంశెట్టి అన్వేష్ కుమార్, కాసుల సాయి రాజశేఖర్, జల్లేపల్లి తేజస్వి, బడుగు పవన్, చెరుకూరి జగదీష్, అందే కోటి వెంకటేశ్వరరావు, మదవిలత, హిమ బిందూ, హాస్పటల్ సీఈఓ పార్థసారథి, మరియు అడిషనల్ ఎస్పీ హనుమంతు, డిఎస్పి శాంతి కుమార్, సీఐ లు తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్లపై దుష్ప్రచారం చేసినవాళ్లు

తలలు ఎక్కడ పెట్టుకుంటారు: ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: కూటమి గెలిస్తే సంక్షేమం ఆగిపోతుంది, పెన్షన్లు రావంటూ తప్పుడు ప్రచారం చేసిన బ్లూ బ్యాచ్ వాళ్ళంతా ఇప్పుడు తలలు ఎక్కడ పెట్టుకుంటారని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. అన్నమాట ప్రకారమే జులై-1 నుంచి రూ.4వేల పింఛను ఠంఛనుగా అందిస్తున్న ప్రభుత్వంపై ఇకనైనా నిందలు మానుకుని క్షమాపణలు చెబుతారా అని నిలదీశారాయన. సెప్టెంబర్-1 ఆదివారం కావ డంతో ఆగస్టు 31నే పింఛను అందించమని ముఖ్య మంత్రి చంద్రబాబు ఆదేశించడం, ఆ మేరకు సచివాలయ సిబ్బందితోనే స్వల్పవ్యవధిలోనే పింఛన్ల పంపిణీ పూర్తి చేయడం తమ ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. చిలకలూరిపేట 34, 35వ వార్డులతో పాటు గంగన్నపాలెం, గోవిందపురంలో పలువురు లబ్దిదారులకు శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పంపిణీ చేశారు. ఎడతెరిపి లేకుండా కుండపోతగా వర్షం కురుస్తున్నా లబ్దిదారులకు పింఛను నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా

మాట్లాడిన ఆయన రాష్ట్ర చరిత్రలో ఒకటో తేదీకి ముందుగానే పింఛన్లు పంపిణీ చేయడం ఇదే తొలిసారి అని తెలిపారు. ఈ సందర్భంగానే గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 65.18 లక్షలమందికి ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జులై 1న రూ.7 వేల చొప్పున ఇచ్చామని, ఇప్పుడు రూ.4 వేలు, రూ.6 వేలు, రూ.15 వేల చొప్పున లబ్దిదారులకు ఇవ్వడం జరుగుతుందన్నారు.

సహకారం లేకనే.. అభివృద్ధి చేయలేకపోయా..

మునిసిపల్ చైర్మన్ డాక్టర్ దాస్తగిరి ఆవేదన

విశాలాంధ్ర-వినుకొండ: తాను వైసిపి అధికార పార్టీ మున్సిపల్ చైర్మన్‌గా గెలిచి నాలుగేళ్లు అవుతున్నా అప్పటి ప్రజాప్రతినిధి, మున్సిపల్ అధికారుల నుంచి సహకారం లేని కారణంగా పట్టణాన్ని ఎటువంటి అభివృద్ధి చేయలేకపోయానని, ఆర్థికంగానూ తీవ్రంగా నష్ట పోయానని మునిసిపల్ చైర్మన్ డాక్టర్ దాస్తగిరి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ నందు అత్యవసర సమావేశం జరిగింది. అజెండాలోని 26 అంశాల్లో 26వ అంశం రద్దు చేయగా ఆరు అంశాలను ఆయా అవార్డుల సభ్యులు రాని కారణంగా వాయిదా వేసి మిగతా అంశాలన్నీ సమావేశం ఆమోదించినట్లు చైర్మన్ తెలిపారు. సమావేశానికి ముందుగా నాలుగేళ్ల పాలనలో తాను పడ్డ అవమానాలను వివరించారు. తాను డాక్టర్ ప్రాక్టీస్ కొంతమేర విడనాడి పట్టణాన్ని అభివృద్ధి చేద్దామని ఆశతో రాజకీయాలలోకి వచ్చి చైర్మన్ అయ్యానని. అయితే అప్పటి ప్రజాప్రతినిధి నుంచి ఎటువంటి సహకారం లేని కారణంగా మున్సిపల్ అధికారులు కూడా తనను చిన్నచూపు చూస్తూ వచ్చారన్నారు. అందువల్లనే పట్టణంలో జరిగే అన్ని ప్రభుత్వ కార్యక్రమాలకు కౌన్సిలర్ అయిన తన భార్య షకీలా దస్తగిరిని పంపుతూ వచ్చానన్నారు. తాను చైర్మన్ అయిన తొలి దశలో గుడ్ మార్నింగ్ వినుకొండ అంటూ.. ప్రతి రోజు వార్డులకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించానన్నారు. డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ పెట్టానన్నారు. అయితే అజెండాలో పొందు పరిచే అంశాలు కూడా అధికారులు తనని తెలియకుండా నిర్లక్ష్యం చేసే వాళ్లని ఆవేదన వ్యక్తం చేశారు. తాను వినుకొండ ముస్లింల కోసం షాదీఖాన నిర్మించేందుకు కోటి రూపాయలు మంజూరు చేశానని. అయితే స్థలం చూపని కారణంగా నిధులు మురిగిపోయాయన్నారు. వైసీపీ ప్రభుత్వం తరుపున తాను చైర్మన్గా పోటీ చేసినా తనకు ఎటువంటి సహకారం ఇవ్వలేదని, అందువల్లే పట్టణంలో అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో చేయలేకపోయానన్నారు. తన చాంబర్‌కు డెకరేషన్ ఖర్చు కూడా తానే సొంతగా పెట్టుకుని బిల్లు పెట్టుకున్నప్పటికీ. నేటి వరకు ఆ బిల్లు ఇవ్వలేదన్నారు. కాగా ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై సమావేశం దృష్టికి తెచ్చారు.. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం.సుభాష్ చంద్రబోస్, డిఈ వెంకయ్య, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌ఓగా గుత్తి వెంకట్రావు

విశాలాంధ్ర-దాచేపల్లి : స్థానిక పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా గుత్తి వెంకట్రావు శనివారం ఉద్యోగ బాధ్యతలు అందుకున్నారు. ఇక్కడ పని చేసిన సురేంద్ర బాబు బుచ్చిరెడ్డి పాలెం సర్కిల్‌కు బదిలీ అయ్యారు. వెంకట్రావు ఎస్పీ ఆఫీసు నుంచి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఎసైలు సంధ్యారాణి, శివ నాగరాజుతో పాటు సిబ్బంది ఆయన్ను అభినందించారు.

వర్షంలో సైతం పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-దాచేపల్లి : ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాన్ని సైతం లెక్కచేయకుండా శనివారం టీడీపీ నేతలు, అధికారులు పింఛన్లు పంపిణీ చేశారు. తహశీల్దార్ కుటుంబరావు శ్రీనగర్, రామాపురం, కేసానపల్లి గ్రామాల్లో పర్యటించి వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం రామాపురంలో కృష్ణా నదిలో నీటి ఉధృతిని మారో మారు పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని అక్కడి వారందరికీ సూచించారు. కేసానపల్లి కార్యదర్శి నాగేంద్ర రత్నంతో పాటు సచివాలయ సిబ్బంది, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

వర్షపు నీటిలో పత్తి పొలం

విశాలాంధ్ర-దాచేపల్లి : పల్నాడు ప్రాంతంలో శనివారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. దీనిలో భాగంగానే దాచేపల్లి నగర పంచాయతీ సహ మండలంలోని మిగతా గ్రామీణ ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పత్తి, మిర్చి తదితర పంట పొలాలన్నీ నీట మునిగాయి. జన జీవనం స్తంభించింది. ఎడతెరిపి లేకుండా ఈదురు గాలులతో పాటు కురిసిన వానతో ప్రజలు ఇళ్ళు నుంచి బయటకు రాలేదు. ఈ వర్షం రైతులకు మేలు చేసింది. వేసవిని తలపిస్తున్న ఎండలతో అల్లాడుతున్న ప్రజలు సేదదీరారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలోని నిర్మలా గర్ల్స్ హైస్కూల్ ప్రాంతంలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉంది. డ్రైనేజీ మురుగు నీరు అంతా తాగునీటి పైపులైన్ లో కలిసి కలుషితం అవుతుందని, సమస్య వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ సమావేశంలో నిర్మల స్కూల్ యాజమాన్యం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరికి వినతి పత్రం అందజేశారు. మురుగునీరు తాగునీటి పైప్ లైన్‌లో కలుస్తున్నందువల్ల నీరు కాలుష్యం అయ్యి బాలికలు అస్వస్థతకు గురవుతుంటారని, వెంటనే డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని వారు చైర్మన్‌ను, కమిషనర్ను కోరారు.

పోలేపల్లిలో ఉపాధి హామీ గ్రామ సభ

విశాలాంధ్ర-దుర్గి: మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో శనివారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో జరిగిన పనులు,పెన్షన్లకు సంబంధించి సామాజిక తనిఖీ బృందాలు రికార్డుల ప్రకారం పనులు జరిగాయా లేదా క్షేత్ర స్థాయిలో పరిశీలించి రికార్డ్ నమోదు చేసిన దానిపై సర్పంచి దేశం శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంబారావు, ఉపాధి హామీ కూలీలు సమక్షంలో గ్రామ సభ జరిపినట్లు స్టేట్ రిసోర్స్ పర్సన్ జె ఎస్ రాజు తెలిపారు. తొలుత ఆయన డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్ వద్ద నుంచి తనిఖీ చేసిన రికార్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జి.సిహెచ్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

81.89 శాతం పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర-దుర్గి: మండలంలో శనివారం 81.89 శాతం ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఇన్చార్జి ఎంపీడీఓ జి.లక్ష్మీ నారాయణ గుప్తా తెలిపారు. సచివాలయ సిబ్బంది, ఇతర అధికారులు శనివారం తెల్లవారుజామున 5 గంటలకు గ్రామాలకు వెళ్ళి వర్షంలో సైతం లబ్ధిదారులకు పెన్షన్ నగదును అందజేశారు. దీనిలో భాగంగా కోలగుట్ల గ్రామంలో జరుగుతున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి, మండల ప్రత్యేకాధికారి కె.సంజీవరావు, ఎంపీడీఓ గుప్తా పరిశీలించి లబ్ధిదారులకు పెన్షన్ డబ్బులు పంపిణీ చేశారు. పెన్షన్లు పంపిణీలో ఏ సమస్య రాకుండా మండల స్థాయి అధికారులు పి.శివప్రసాద్, వై.అమీర్ రెడ్డి, జి.సిహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్. పి.రాజు, హనుమంతరావు, ఇస్తేరు రాణి ప్రత్యేక దృష్టి సారించారు. 31న పెన్షన్ తీసుకోని వారికి సెప్టెంబర్ 2వ తేదీన అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బిజెపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

జోరు వానలోనూ పెన్షన్ల పంపిణీ: కొమ్మలపాటి

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలో జోరుగా వాన కురుస్తున్నప్పటికీ శనివారం తెల్లవారుజాము నుండి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. పట్టణంలో మునిసిపల్, సచివాలయ ఉద్యోగులు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సూచనల మేరకు పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమ్మలపాటి శ్రీధర్ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని మూడవ వార్డు ఇందిరానగర్‌లో ఆయన సచివాలయ ఉద్యోగులతో కలిసి జోరు వానను సైతం లెక్కచేయకుండా గొడుగులు వేసుకొని ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆరోగ్యం బాగోలేక తనను పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారన్నారు. రాష్ట్రంలో ఒకరోజు ముందుగానే పెన్షన్ల పండుగ వచ్చిందని, ఒకప్పుడు వైసిపి ప్రభుత్వం నెల వచ్చి రోజులు గడుస్తున్నా పంపిణీ చేసే పరిస్థితి ఉండేది కాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పక్కాగా ఒకటో తారీకు లేదంటే ఒకరోజు ముందుగానే పెన్షను పంపిణీ చేస్తుందన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడం ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు దినం కావడంతో ఉద్యోగుల సెలవుకు భంగం కలగకుండా, పెన్షన్దారులకు నగదు అందడం కోసం ఒకరోజు ఆలస్యం కాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మేరకు నిర్ణయం తీసుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. జోరు వానను లెక్కచేయకుండా గొడుగులు చేతబట్టి సచివాలయ ఉద్యోగులు పెన్షన్ దార్ల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పేరిట వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు నగదు అందజేయడం పట్ల లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, ఎన్. శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, నాయకులు రాపర్ల జగ్గారావు, పీవీ సురేష్ బాబు, పువ్వాడ కృష్ణభతుల బాలరాజు, సాంబశివరావు,అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో వివక్ష...

- మాజీ మంత్రి వాస్తు కోసం నిబంధనలు తుంగలో తొక్కారు
- మున్సిపల్ సాధారణ సమావేశంలో కౌన్సిల్ సభ్యుల నిలదీత

విశాలాంధ్ర-చిలకలూరిపేట: అంతా ఏక పక్షమే.. ప్రతిపక్ష పాత్రను కూడా టీడీపీ సభ్యులే పోషించారు. వివిధ సమస్యలపై నేరుగా అధికారులపై విమర్శలు ఎక్కుపెట్టారు. చిలకలూరిపేట మున్సిపల్ సాధారణ సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో శనివారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత నిర్వహించారు. రెండు రోజుల కిందటే చైర్మన్ రఫాని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సమక్షంలో టీడీపీలో చేరటంతో పాలక వర్గం దాదాపుగా టీడీపీకి చేతికి అందినట్టైంది. ఎజెండా చదవడం పూర్తి కాగానే పదోవార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి లేచి ఆక్రమణలపై విమర్శలు ఎక్కుపెట్టారు. ఆక్రమణల తొలగింపులో వివక్ష చూపుతున్నారని, అధికారులు డబ్బులు తీసుకొని కొంతమంది ఆక్రమణలను తొలగించటం లేదని ఆరోపించారు. కేబీ రోడ్డులో ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు నరసరావుపేటరోడ్డు, పట్టణంలోని ఇతర ప్రాంతాలలో ఆక్రమణలపై ఎందుకు దృష్టించటం లేదని నిలదీశారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు సమాధానం ఇస్తూ ముందుగా కేబీ రోడ్డువైపు నుంచి ఆక్రమణలు తొలగిస్తున్నామని,అనంతరం పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగిస్తామని వెల్లడించారు. వాస్తు కోసమని నిబంధనలు మార్చి మాజీమంత్రి కట్టిన ఇంద్రభవనాన్ని తలపించే నివాసం వల్లే కొండ్రపాడు.జిడ్డు కాలని.పోలిరెడ్డి పాలెం ఎన్టీఆర్ కాలనీలు జలమయం అయ్యాయని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు ఆరోపించారు. ఇదే విషయం పైన గతంలో మేము అభ్యంతరం తెలిపేమని సమావేశం దృష్టికి తెచ్చారు . మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్.రోడ్లు మరమ్మతులు.డ్రెయిన్ లు శానిటేషన్ .విధి లైట్లు ఏర్పాటు.కుక్కల నియంత్రణ పై కౌన్సిల్ సభ్యులు అడిగినా ప్రశ్నలకు.డి ఈ ఈ వెంకట రమణ. అర్వో.ఏఈ లు . శానటరీ ఇన్స్పెక్టర్ లు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అధికారులు సమాధానాలు ఇచ్చారు

భారీ వర్షాలతో ఎత్తిపోతలకు జలకళ

విశాలాంధ్ర-విజయపురిసౌత్: మాచర్ల మండలంలోని పర్యాటక ప్రాంతమైన ఎత్తిపోతలకు వరద ప్రవాహం భారీగా పెరిగింది. భారీగా వర్షాలు పడుతుండటంతో వాగులు,అటవీ మార్గాల ద్వారా వరద నీరు ఎత్తిపోతలకు చేరుకుంటుంది. ఎత్తిపోతల 70 అడుగుల ఎత్తు నుంచి నీరు కిందకు ప్రవహిస్తూ పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఎత్తిపోతల జలకళను సంతరించుకోవడం తో జలపాత అందాలు చూసేందుకు సందర్శకులు ఎత్తిపోతల చేరుకుంటున్నారు.

కాజా టోల్గేట్ వద్ద వరద ఉధృతి

విశాలాంధ్ర - మంగళగిరి: మంగళగిరి మండలం, ఖాజా గ్రామం వద్ద హైవేపై చిన్నపాటి చెరువులను తలపిస్తున్న హైవే రోడ్లు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల వరదనీరు ఉధృతంగా రోడ్డుపై ప్రవహిస్తూ రాకపోవలకు అంతరాయం కలిగిస్తున్నది. టోల్గేట్ వద్ద హైవేపై ట్రాఫిక్ అంతరాయం కలిగింది. దయచేసి ప్రజలు అనవసరంగా రోడ్డుపై రావద్దని, వాహనాలు సైతం కొట్టుకుపోయే పరిస్థితి ఉన్నందున ఇళ్లలోనే ఉండాలని ప్రమాదాలకు గురికా వద్దని, ప్రశాంత వాతావరణంలో ఉండాలని తెలియజేశారు. ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బంది కలిగిన ఫోన్ చేసి పోలీసు వారికి తెలియజేయాలని రూరల్ ఎస్సై వెంకట్ తెలిపారు.

వర్షపు నీటిలో ఎన్ఎస్‌యూఐ పడవ ప్రయాణం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యాన్ని నిలువునా ఎండకట్టారు ఎన్ఎస్‌యూఐ గుంటూరు జిల్లా అధ్యక్షులు షేక్ కరీం.. గత కొన్ని రోజులుగా భారీ వర్షం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపినప్పటికీ గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు చోద్యం చూశారని కరీం విమర్శించారు. ఏమాత్రం ముందస్తు చర్యలు చేపట్టలేదని, డ్రైనేజీలలో పూడికతీత వంటి పనులు ఏ మాత్రం చేపట్టలేదన్నారు. దీంతో వర్షపు నీటితో నిండిపోయిన డ్రైనేజీ, సైడు కాలువలోని నీరు రోడ్లపైకి భారీగా చేరిందని చెప్పారు. నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు షేక్ కరీం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట చెరువును తలపిస్తున్న వర్షపు నీటిలో శనివారం పడవ ప్రయాణం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ వినూత్న నిరసనకు అటుగా పయనించే వాహనదారులు మద్దతు పలికారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు మొద్దు నిద్ర వీడి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. గుంటూరు నగర ఎన్ఎస్‌యూఐ ఇన్‌చార్జ్ ఏసు రాజు, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుమంత్, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మదన్, సలాం, జానీ, రాజు, సోహెల్ పాల్గొన్నారు.

మాటకు కట్టుబడటం చంద్రబాబుకే సాధ్యం : యాగంటి

విశాలాంధ్ర-మాచర్ల : ఇచ్చిన మాటకు కట్టుబడటం సీఎం చంద్రబాబుకే సాధ్యమని అవ్వ తాతలకు ఒక రోజు ముందు గానే పెన్షన్‌ను అందించి చంద్రబాబు మాట నిలబెట్టుకున్నా రని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు అన్నారు. ప్రతి నెల 1న అందించాల్సిన పెన్షన్ పంపిణీని ఆదివారం రావడంతో ఒకరోజు ముందుగానే జోరున వాన కురుస్తున్నా లెక్కచేయకుండా రూ.2730 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్‌ను చెల్లించటం సంతోషకరమన్నారు. శనివారం యాగంటి మల్లికార్జునరావు విలేకరులతో మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయం తెలుగుదేశం పార్టీకే సాధ్య మౌతుందన్నారు. ఎన్నికల ముందు నాటి ముఖ్య మంత్రి జగన్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెన్షన్లు ఇవ్వ లేరని దుష్ప్రచారం చేసిన మాటలను ఆయన గుర్తు చేశారు. కల్లబొల్లి మాటలతో నాటి ప్రభుత్వం ఐదేళ్లు పాటు కాలం గడిపిందన్నారు. అభివృద్ధి లేదు.. సంక్షేమం లేదు దాడులు దౌర్జన్యాలతో వైసిపి పాలన సాగించిందన్నారు. వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపీలంతా లక్షల కోట్లు దోచుకున్నారన్నారు. చంద్రబాబు పాలనలో పంటలు పండవని వర్షాలు పడవని దుర్మార్గపు మాటలతో వైసిపి నాయకులు దుష్ప్రచారం చేశారన్నారు. వారి మాటలకు భిన్నంగా సకాలంలో వర్షాలు కురుస్తూ రాష్ట్రం సస్య శ్యామలంగా ఉందన్నారు. రాజధాని అమరావతిని తీర్చిదిద్దుతూ గుంటూరు-విజయవాడ జంట నగరాలుగా చంద్రబాబు అభివృద్ధి చేయనున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు రానున్నాయని, ఇప్పటికే పారిశ్రామికవేత్తలతో ఒప్పందాలు కుదిరాయన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందనుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రముఖ కంపెనీలతో జాబ్ మేళా నిర్వహించి సుమారు 800 మందికి పైగా నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన ఘనత ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికే దక్కిందన్నారు. నియోజకవర్గంలోకూటమి ప్రభుత్వ నాయకులు, ఉద్యోగులు పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉదయం 6 గంటలకే అవ్వ తాతలకు పెన్షన్ అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

నియోజకవర్గంలో ఎడతెరిపి లేని వర్షం

విశాలాంధ్ర-పెదకూరపాడు : నియోజకవర్గ పరిధిలోని అచ్చంపేట, బెల్లంకొండ, క్రోసూరు, పెదకూరపాడు, అమరావతి మండల ప్రాంతాలలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. శనివారం ఉదయానికే వాగులు పొంగి పొర్లుతున్నాయి. బలుసుపాడు, మాదిపాడు, అచ్చంపేట, పరస, కంభంపాడు, 75 త్యాళ్లూరు, పెదకూరపాడు ప్రధాన రహదారుల్లో లోలెవల్ బ్రిడ్జిల మీదుగా నీరు ప్రవహిస్తుంది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాగుల వద్ద రెవెన్యూ అధికారులు వీఆర్వో, వీఆర్ఏలు, పోలీసులు కాపలా ఉన్నారు. పాఠశాలలకు సెలవు దినం ప్రకటించారు. పాలవాహనాలు కూడా వెళ్ళలేని పరిస్థితుల్లో పాలసేకరణ నిలిపివేశారు. జోరు వానలో కూడా అధికారులు, లబ్ధిదారుల ఇంటివద్దకే వచ్చి ప్రభుత్వ ఫించన్లు అందిస్తున్నారు. విద్యుత్ శాఖలో సిబ్బంది అప్రమత్తంగా ఉండి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్నారు. చెరువులు పూర్తిస్థాయిలో నిండి ప్రమాదస్థాయిలో ఉన్నాయి. జామలకుంట చెరువు గట్టు మీదుగా పొర్లుతుంది. గ్రామాలలో సంబంధిత అధికారులు వరదను పర్యవేక్షిస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని తహశీల్దార్ దానిల్ తెలిపారు. ముఖ్యంగా పశువులు, గొర్రెలు, మేకలు పెంపకం చేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ముద్దాయికి జైలు,జరిమానా

విశాలాంధ్ర-ఈపూరు:నకిలీ కరెన్సీ నోటును మార్చిన కేసులో ముద్దాయికి మూడు సంవత్సరాల ఆరు నెలల జైలు శిక్షతో పాటుగా రూ2,500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని ఈపూరు ఎస్సై ఎం. ఉమామహేశ్వరరావు శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2019 వ సంవత్సరం ఆగస్టు 24 తేదీన మండలంలోని వనికుంట గ్రామంలో కూల్ డ్రింక్ షాప్ లో ముగ్గురు యువకులు కూల్ డ్రింక్ తీసుకొని రూ 500 రూపాయల నోటు ఇచ్చారు. షాపు యజమాని కాశీ మల్ల నాగరాజు నోటును పరిశీలించి నకిలీ నోటుగా గుర్తించి యువకులను ప్రశ్నించగా యువకులు ఏమి మాట్లాడకుండా పారిపోయారు. వెంటనే సదరు షాప్ యజమాని నాగరాజు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై గిరిబాబు కేసు నమోదు చేశారు. అప్పటి వినుకొండ సిఐ ఎంవి. సుబ్బారావు కేసు దర్యాప్తు చేసి రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామానికి చెందిన వర్ల చిరంజీవిని అరెస్టు చేసి కోర్టుకు పంపారు.

కమిషనర్‌కు ఘనసత్కారం

విశాలాంధ్ర-వినుకొండ: మున్సిపల్ పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పట్టణ అభివృద్ధిపై ముందుకు సాగు దామని కౌన్సిలర్లు ఆకాంక్షించారు. నూతనంగా విచ్చేసిన మున్సిపల్ కమిషనర్ ఎం.సుభాష్ చంద్రబోస్‌ను కౌన్సిలర్లు ఎస్.పుల్లయ్య, జయరాజులు పూలమాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పాలకవర్గం మున్సిపల్ అధికారులు పూర్తి సహకారం అందిస్తే పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ. వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పొంగిపొర్లిన కొండవీటి వాగు

విశాలాంధ్ర-తాడికొండ: వాయుగుండ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి లాం వద్ద కొండవీటి వాగు పొంగి పొరలింది. 24 గంటల పాటు ఏకధాటిగా వర్షం పడింది. తాడికొండ, కంతేరు మధ్య ఉన్న ఎర్ర వాగు అలాగే తాడికొండ పెద్దపరిమి గ్రామాల మధ్య ఉన్న నక్క వాగు పొంగిపొర్లాయి. పల్లపు, మెరక పొలాల్లో సైతం భారీగా వరద నీరు వచ్చి చేరింది. కొన్నిచోట్ల పంట పొలాలు నీట మునిగాయి. గుంటూరు వెళ్లే ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. చింత చెట్టు కూలిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. ఎన్నడు లేని విధంగా వర్షం రావడంతో పల్లపు ప్రాంతాలు జలమయంగా మారాయి. శనివారం 228 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

నేడు బుర్రముక్కు సర్వారెడ్డి వర్ధంతి

విశాలాంధ్ర-తాడేపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు కామ్రేడ్ బుర్ర ముక్కు సర్వారెడ్డి 10వ వర్ధంతి సభ ఆదివారం ఉదయం 10 గంటలకు తాడేపల్లి నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ సీపీఐ కార్యాలయంలో జరుగుతోందని ఆ పార్టీ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు సానుభూతిపరులు పాల్గొని సర్వారెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలని కోరారు.

వాగుల ఉధృతితో రాజధానికి నిలిచిన రాకపోకలు

విశాలాంధ్ర-తుళ్లూరు: శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని పెదపరిమి వద్ద కోటేళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎడతెరిపి లేని వర్షం కారణంగా వాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో రాజధానికి రాకపోకలు నిలిచిపోయాయి. గుంటూరు పరిసర ప్రాంతాల నుంచి రాజధాని అమరావతిలోని సచివాలయం, హైకోర్టుకు,ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు రాకపోకలు సాగుతుంటాయి. వాగుల ఉధృతి కారణంగా రాజధానికి చేరుకోలేని పరిస్థితి ఏర్పడింది. కోటేళ్లవాగుపై ఉన్న లో లెవెల్ చప్టా మీదుగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో గుంటూరు - తుళ్లూరు ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున నీరు ప్రవహిస్తూ సమీపంలోని పంట పొలాల్లోకి చేరడంతో పత్తి, మినుము, కూరగాయలు నీట మునిగాయి. కోటేళ్ల వాగుతో పాటు పెదపరిమి - నెక్కల్లు మధ్య, పెదపరిమి - నీరుకొండ, పెదపరిమి - మోతడక మధ్య వాగులు,తాడికొండ మండలంలోని లాం వద్ద వాగు పొంగిపొర్లుతున్నాయి. దశాబ్దాల కాలంగా అధిక వర్షాలవల్ల వాగులు పొంగి రవాణా వ్యవస్థకు ఆటంకం కలగడంతో పాటు పంట

నష్టం,ప్రాణనష్టం జరిగినా పాలకులు శాశ్వత ప్రాతిపదికన నష్ట నివారణ చర్యలు తీసుకోవడం లేదని పెదపరిమికి చెందిన రైతు సరిపూడి సాంబశివరావు అన్నారు. రాజధాని నిర్మాణం నుంచి మినహాయించడంతో పెదపరిమిలో పంటల సాగు యధావిధిగా జరుగుతోందని, వాగులు పొంగి పంటలను ముంచెత్తడం వల్ల పంట నష్టం వాటిల్లుతోందని ఆవేదన వెలిబుచ్చారు. వాగులపై ఉన్న లోలెవెల్ చప్టాలను హై లెవెల్ చప్టా లుగా అభివృద్ధి చేస్తామని చెప్పిన మాటలు కార్యరూపం దాల్చడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. దొండపాడు, తుళ్లూరు, పెదపరిమి,

రోడ్లపై ప్రవహిస్తున్న వర్షం నీరు

నేలపాడు తదితర గ్రామాల్లో సైడ్ కాల్వల్లో నీరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తోంది. తుళ్లూరులోని ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలోని తూర్పు వీధి వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

సీడ్ యాక్సెస్ రోడ్డుపైకి..

ఉద్దండరాయునిపాలెం,లింగాయపాలెం వద్ద సీడ్ యాక్సెస్ రోడ్డుపైకి పెద్ద ఎత్తున వర్షం నీరు చేరింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దొండపాడు టిడ్కో గృహాలకు వెళ్లే రోడ్డు పై గుంతలలోకి నీరు చేరడంతో లబ్ధిదారులు రాకపోకలు సాగించడం కష్టంగా మారింది.

జంగిల్ క్లియరెన్స్‌కు ఆటంకం..

రాజధానిలో జంగిల్ క్లియరెన్స్‌కు వర్షం వల్ల ఆటంకం ఏర్పడింది. భారీ యంత్రాలు బురదలో కూరుకుపోయే ప్రమాదం ఉన్నందున పనులను నిలిపివేశారు.